www.vishalabharati.com
epaper:vishalabharati.com

శనివారం, హైదరాబాద్
24.08.2024
సంపుటి:2 సంచిక:308

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక



# 300లకే ఇంటర్నెట్, కేబుల్ టీవీ, ఈ ఎడ్యుకేషన్

- తెలంగాణ ప్రభుత్వం దీనిపై యోచిస్తోంది
- జ్యోతిరాధిత్య సింధియాతో సీఎం, డిప్యూటీ సీఎం భేటీ
- 93 లక్షల గృహాలకు ఫైబర్ కనెక్షన్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం పలువురు కేంద్రమంత్రులను కలిసి రాష్ట్రానికి చేయూతనివ్వాలని కోరింది. ఈ మేరకు కేంద్ర టెలికంశాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క కలిశారు. రాష్ట్రంలోని 93 లక్షల గృహాలకు ఫైబర్ కనెక్షన్ సదుపాయం కల్పించాలని లక్ష్యంగా పెట్టకున్నట్లు సింధియాకు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. టిఫైబర్ ద్వారా ఇంటర్నెట్ కనెక్టివిటీని కల్పించడం తమ ఉద్దేశమని వివరించారు. నెలకు కేవలం రూ.300కే ఇంటర్నెట్, కేబుల్ టీవీ, ఈఎడ్యుకేషన్ సేవలు అందించాలని తమ ప్రభుత్వం యోచిస్తున్నట్లు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రూ.1779 కోట్ల పెట్టుబడులతో ప్రతిపాదించిన టీఫైబర్ ప్రాజెక్టు అమలుకు ప్రభుత్వం ఇప్పటికే రూ.530 కోట్లు సమీకరించిందని తెలిపారు. జాతీయ ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ మొదటి దశ మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వానికి సకాలంలో అందించాలని రేవంత్‌రెడ్డి కోరారు. అనంతరం కేంద్ర క్రీడలశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో భేటీ అయ్యారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులు హైదరాబాద్‌లో ఉన్నట్లు వివరించారు. భవిష్యత్‌లో ఒలింపిక్స్ , ఆసియా గేమ్స్, కామన్ వెల్త్ గేమ్స్ తెలంగాణలో నిర్వహించే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. 2025 జనవరిలో నిర్వహించే ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు ఆతిథ్యమిచ్చే అవకాశం హైదరాబాద్‌కి ఇవ్వాలని కేంద్రమంత్రిని మఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.



## పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ గౌడ్ ?

- సీనియర్ల నుంచి ఏకాభిప్రాయం
- మధుయాష్కి గౌడ్ కు మొండిచేయి
- పంతం నెగ్గించుకున్న ముఖ్యమంత్రి

..మిగతా 2 లో



## నేపాల్‌లో నదిలో పడిన బస్సు

- 27 మంది మృతి
- పలువురికి గాయలు
- పొఖారా నుంచి కాఠ్‌మాండూకు వెళ్తుండక ఘటన

..మిగతా 2 లో



# మోడీ శాంతి మంత్రం

- అధ్యక్షుడు జెలెన్ స్కీతో కీలక సమావేశం
- యుద్ధం ముగింపునకు రష్యాతో చర్చించాలని సూచన
- ఇరు దేశాల మధ్య స్నేహితుడిగా వ్యవహరిస్తానని భరోసా
- భారత్ ఎల్లప్పుడూ శాంతి వైపే నిలుస్తుందన్న ప్రధాని

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

భారత ప్రధాని నరేంద్ర మోడీ ఉక్రెయిన్‌లో పర్యటిస్తున్నారు.ఈ మేరకు శుక్రవారం ఉదయం పోలాండ్ నుంచి ప్రధాని రైలులో కీవ్ చేరుకున్నారు. ఈ సందర్భంగా నరేంద్ర మోడీకి ప్రజలు ఘన స్వాగతం పలికారు. మోడీకి స్వాగతం పలికిన ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. ఇద్దరూ కలిసి నేషనల్ మ్యూజియంకు చేరుకున్నారు. అక్కడికి వెళ్లే సమయంలో జెలెన్‌స్కీ భుజంపై చేతులు వేసిన మోడీ ఆత్మీయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. రష్యాఉక్రెయిన్ మధ్య యుద్ధంలో మరణించిన పిల్లలకు, సైనికులకు ఇద్దరు నాయకులు నివాళులు అర్పించారు. ఈ సమయంలో ఇద్దరు భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ... రష్యాఉక్రెయిన్ యుద్ధంలో భారత ఎప్పుడూ తటస్థంగా లేదని, తాము ఎల్లప్పుడూ శాంతి వైపే ఉన్నామని స్పష్టం చేశారు. చర్చలు, సంభాషణల ద్వారా వివాదాలు పరిష్కరించే మార్గాలను భారత్ సమర్థిస్తుందన్నారు. ప్రధాని మోడీ ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. రష్యాఉక్రెయిన్ సంక్షోభం పరిష్కార మార్గాలపై ఇరువురు నేతలు చర్చించుకున్నారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ముగించడానికి రష్యాతో చర్చలకు సిద్ధం కావాలని జెలెన్ స్కీని కోరారు ఇరు దేశాల మధ్య శాంతిని నెలకొల్పేందుకు స్నేహితుడిగా వ్యవహరించడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఈ మేరకు చర్చలు, దౌత్యం ద్వారా మాత్రమే యుద్ధానికి పరిష్కారానికి మార్గం కనుగొనవచ్చని మోడీ వెల్లడించారు. సమయాన్ని వృథా చేయకుండా ఆ దిశలో పయనించాలని సూచించారు. ఈ సంక్షోభం నుంచి బయటపడటానికి

..మిగతా 2 లో

**మోడీ రికార్డు...**

ఒక భారత ప్రధాని ఉక్రెయిన్‌లో పర్యటిస్తుండటం దేశ చరిత్రలో ఇదే తొలిసారి కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. 1991లో సోవియట్ యూనియన్ నుంచి విడిపోయి ఉక్రెయిన్ ప్రత్యేక దేశంగా ఆవిర్భవించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు భారత్‌కు చెందిన ఏ ప్రధాని కూడా ఆ దేశానికి వెళ్లలేదు. ఇప్పుడు అక్కడికి వెళ్లిన తొలి ప్రధానిగా నరేంద్ర మోడీ రికార్డు నెలకొల్పారు.



# చర్యకు ప్రతిచర్య తప్పదు

## అధికారం శాశ్వతం కాదు

- ఈ విషయాన్ని కాంగ్రెస్ గుర్తుంచుకోవాలి
- ఆడబిడ్డల మీద ప్రతాపం చూపిస్తారా?
- మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ మీద దాడి చేస్తారా?
- అన్ని అంశాల మీద డీజీపీకి ఫిర్యాదు చేశాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మా సహనాన్ని పరీక్షిస్తే.. చర్యకు ప్రతిచర్య తప్పదు అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయాన్ని సీఎం

..మిగతా 2 లో





# మోడీ శాంతి మంత్రం

మొదటిపేజీ తరువాయి

ఇరుపక్షాలు కలిసి కూర్చొని చర్చించాలన్నారు. శాంతిని నెలకొల్పే దిశగా జరిగే ఎలాంటి ప్రయత్నాల్లో అయినా క్రియాశీలక పాత్ర పోషించేందుకు భారత్ సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. ఈ విషయంలో ఒక స్నేహితుడిగా నేను మీకు ఏం చేయాల్సి వచ్చినా అందుకు సిద్ధంగా ఉన్నానని భరోసా ఇచ్చారు. పర్యటనలో భాగంగా కీవ్‌లో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి ప్రధాని మోడీ నివాళి అర్పించారు. బాపూజీ ఆశయాలు విశ్వవ్యాప్తమని, కోట్లాది మందికి స్ఫూర్తిదాయకమని ప్రధాని వెల్లడించారు. మానవాళికి మహాత్ముడు చూపించిన బాటలో నడుద్దామని పిలుపునిచ్చారు.

**ఇరు దేశాల మధ్య నాలుగు ఒప్పందాలు...**

ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో ప్రధాని మోడీ భేటీ సందర్భంగా ఇరు దేశాల మధ్య నాలుగు ఒప్పందాలు కుదిరినట్లు భారత ప్రభుత్వం వెల్లడించింది. వ్యవసాయం, ఆరోగ్యం, సంస్కృతి, మానవతా సాయం అంశాలపై పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపింది. ద్వైపాక్షిక సంబంధాలతో పాటు వాణిజ్యం, ఆర్థిక అంశాలు, రక్షణ రంగం, ఫార్మాస్యూటికల్స్, వ్యవసాయం, విద్య అంశాలపై ఇరువురు నేతలు చర్చించుకున్నారని తెలిపింది.

**పర్యటన యుద్ధం ముగింపునకు దోహదం...**

రష్యా ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికేందుకు ప్రధాని మోడీ పర్యటన దోహదపడుతుందని ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఐక్యరాజ్య సమితి చీఫ్ దీనిపై సానుకూలంగా ఉన్నట్లు సెక్రటరీ జనరల్ అధికార ప్రతినిధి స్టీఫెన్ దుజారిక్ తెలిపారు. ప్రధాని మోడీ పర్యటనపై దుజారిక్ మీడియా సంస్థతో మాట్లాడారు. ఇప్పటికే చాలామంది దేశాధినేతలు, ప్రభుత్వాధినేతలు కీవ్ను సందర్శించాన్నారు. ఈ సందర్శనలు యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ తీర్మానాలు, అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా సంఘర్షణను పరిష్కరించడానికి దోహదపడతాయని ఆశిస్తున్నామన్నారు. మోడీ పర్యటన యుద్ధానికి ముగింపు పలికేందుకు దోహదపడుతుందని భావిస్తున్నామని వెల్లడించారు.

# చర్యకు ప్రతిచర్య తప్పదు

మొదటిపేజీ తరువాయి

రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలని కేటీఆర్ సూచించారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ పార్టీ శ్రేణుల దాడులు, పోలీసు నిర్లక్ష్య వైఖరిపై రాష్ట్ర డీజీపీని కేటీఆర్, సీనియర్ నాయకులు కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. నిన్న ఒక్క రోజే రెండు ఉదంతాలు చోటు చేసుకున్నాయి. వాటికి సంబంధించి ఆధారాలతో సహా డీజీపీకి ఫిర్యాదు చేశాం. విద్యార్థి నాయకుడు, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా తిరుమలగిరిలో రైతు నిరసన దీక్ష కార్యక్రమం చేపట్టాం. 50 మంది కాంగ్రెస్ గుండాలు, తాగిన మత్తులో ఆకస్మికంగా రాళ్లు, గుడ్లు, సుతిలి బాంబులతో దాడి చేశారు. మా వాళ్లు తిరగబడి ఉంటే ఆ 50 మంది కాంగ్రెస్ మూకలు ఒక్కరు కూడా మిగిలేవారు కాదు. కానీ శాంతియుతంగా మేము నిరసన తెలుపాలని భావించాం. అందుకే ఎలాంటి ప్రతిఘటనకు పాల్పడలేదు. పోలీసులే మా నిరసన దీక్షకు సంబంధించిన టెంట్ కూల్చేయటం ఆశ్చర్యం కలిగించింది అని కేటీఆర్ తెలిపారు.

**ఆ ఆడబిడ్డలు ఏం తప్పు చేశారు?**

నిన్న ఇద్దరు మహిళ జర్నలిస్టులు సీఎం సొంత ఊరు కొండారెడ్డిపల్లికి పోయారు. వాళ్ల మీద కాంగ్రెస్ గుండాలు అసభ్యకరంగా దాడి చేశారు. వాళ్లేమైనా ముఖ్యమంత్రి లాగా బజారు బాష మాట్లాడారా? లాగుల తొండలు జొర్రకొడతాం, చెట్టుకు కట్టేసి కొడతాం అన్నారా? రుణమాఫీ అయ్యిందా? లేదా అని తెలుసుకోవటానికి వెళ్లారు. వారిపైన కూడా కాంగ్రెస్ చిల్లరగాళ్లు దాడి చేశారు. కాంగ్రెస్ గుండాలు వారిని వెల్దండ పోలీస్ స్టేషన్ వరకు వెంబడించారు. ఆ ఆడబిడ్డలు ఏం తప్పు చేశారు? వారికి సీఎం క్షమాపణం చెప్పాలి. నీ బండారం బయట పెట్టినందుకా? వారి మీద దాడి చేయించవ్. అంతే కాకుండా వాళ్ల మీద నికృష్టమైన భాషలో సోషల్ మీడియాలో కాంగ్రెస్ చిల్లర మనుషులు ప్రచారాలు చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు.

**సమాధానం చెప్పలేని దద్దమ్మ ఈ సీఎం రేవంత్ రెడ్డి**

రుణమాఫీ విషయంలో వాస్తవాలను ప్రజల్లోకి పోయి సమాధానం చెప్పలేని దద్దమ్మ ఈ సీఎం రేవంత్ రెడ్డి. రుణమాఫీపై ఏ ఊరికైనా వెళ్దాం రా అని మేము సవాల్ చేస్తే రాలేదు. కానీ ఢిల్లీకి 20 సార్లు పోయిండు. క్షేత్రంలో తిరగాల్సిన సీఎం...ఢిల్లీ చుట్టు చక్కర్లు కొడుతున్నారు. సీఎంకు దమ్ముంటే నువ్వు ఏ ఊరికి పోదామో చెప్పు. అక్కడికి వెళ్లి రుణమాఫీ అయ్యిందా అనే విషయాన్ని అడుగుదాం. ఎక్కడ కూడా చారాణ రుణమాఫీ కాలేదు అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కొంత మంది పోలీసులు మాత్రం అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు**

రాష్ట్రంలో మనం పోలీసులను, వ్యవసాయ అధికారులను తప్పు బట్టాల్సిన పని లేదు. తప్పు ముఖ్యమంత్రిది, చేతకాని సన్నాసి సీఎంది. అయితే పోలీసుల మీద మాకు సానుభూతి ఉంది. కానీ కొంత మంది పోలీసులు మాత్రం అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు అది మంచిది కాదు. సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కూడా బెదిరింపులకు పాల్పడుతున్నారు. అత్యుత్సాహం ప్రదర్శించవద్దు. అధికారం మారుతుంది. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని పోలీసులకు సూచిస్తున్నా. తిరుమలగిరి ఘటనలో దాడి చేసిన వారిపై కేసులు పెట్టి అరెస్ట్ చేయాలి. మహిళా జర్నలిస్ట్‌లపై దాడులు చేసిన వారిపై కూడా కేసులు పెట్టి అరెస్ట్ చేయాలి. జర్నలిస్ట్‌లకే రక్షణ లేకపోతే...రాష్ట్రంలో సామాన్య పౌరుల పరిస్థితి ఏందీ? అని కేటీఆర్ నిలదీశారు.



**హైదరాబాద్‌లో శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పాయి..**

మంచిర్యాలలో ఎమ్మెల్యే కారణంగా మా నాయకుడు గొంతు కోసుకున్నాడు. మొత్తంగా వ్యవస్థలను అడ్డం పెట్టుకొని ఈ ముఖ్యమంత్రి అధికారం చెలాయించాలనుకుంటే అంతకన్నా మూర్ఖత్వం మరొకటి ఉండదు. హైదరాబాద్‌లో శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పాయి. నెల రోజుల్లో 28 హత్యలు అనే వార్తలు వస్తున్నాయి. ఈ నగరానికి ఏమైంది అంటూ సీఎంకు దన్నుగా నిలిచిన పత్రికలే వార్తలు రాస్తున్నాయి. పోలీసు యంత్రాంగం మీద మాకు సానుభూతి ఉంది. మిమ్మల్ని అడ్డం పెట్టుకొని సీఎం అధికారం చెలాయిస్తున్నాడు. సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కూడా మా పార్టీ యువకులను వేధిస్తున్నారు. ఇంకా ఇలాగే కొనసాగితే మా నుంచి ప్రతిఘటన కూడా తప్పదు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బ తినవద్దనే మేము ఇప్పటి వరకు ఊరుకుంటున్నాం. మా సహనాన్ని, చేతగానితనం అనుకోవద్దు. మేము ప్రతిఘటిస్తే అప్పుడు మమ్మల్ని నిందించవద్దు. కొంతమంది పోలీసులు మంత్రుల బర్త్ డే కార్యక్రమాల్లో పరవశించి పోతున్నారు. డీజీపీకి ఇలాంటి పోలీసుల మీద చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాం. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న అన్ని నిర్మాణాలను కూల్చండి. పొంగులేటి, వివేక్, కేవీపీ, మధుయాష్కీ లాంటి నేతల భవనాలను కూల్చేసి ఆ తర్వాత సామాన్యుల భవనాలను కూల్చేయండి అని కేటీఆర్ సూచించారు.

**పొంగులేటికి అంత శ్రమ అక్కర్లేదు.. మా దగ్గర శాటిలైట్ విజువల్స్ ఉన్నాయి**

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల పరిధిలో అక్రమంగా ఉన్న భవనాలన్నీ కూల్చాల్సిందే.. నేతల భవనాలను కూల్చిన తర్వాత సామాన్యులవి కూల్చాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ పార్టీ శ్రేణుల దాడులు, పోలీసు నిర్లక్ష్య వైఖరిపై రాష్ట్ర డీజీపీని కేటీఆర్, సీనియర్ నాయకులు కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. తన ఇల్లు బఫర్ జోన్ పరిధిలోని లేదని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెబుతున్నారని ఓ మీడియా ప్రతినిధి కేటీఆర్‌ను ప్రశ్నించగా.. ఆయన ఈ విధంగా బదులిచ్చారు. పొంగులేటికి అంత శ్రమ అవసరం లేదు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న నిర్మాణాలకు సంబంధించి శాటిలైట్ మ్యాప్స్ ఉన్నాయి. ఆయన అంత బాధపడాల్సిన అవసరం కూడా లేదు. ఎలా చెరువులు పూడ్చి కట్టారో అవన్నీ కూడా శాటిలైట్ ఇమేజెస్ ఉన్నాయి. చూసుకోండి.. రంగనాథ్ గారితో మాట్లాడుకోమనండి. ఎఫ్‌టీఎల్, బఫర్‌లో ఉన్న నిర్మాణాలను మొదట కూల్చడం ప్రారంభించండి. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్, కేవీపీ రామచంద్రరావు, మధుయాష్కీ, గుత్తా సుఖేందర్ రెడ్డి లాంటి నేతల భవనాలను కూల్చేసి ఆ తర్వాత సామాన్యుల భవనాలను కూల్చేయండి అని కేటీఆర్ సూచించారు.

# పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ గౌడ్ ?

- సీనియర్ల నుంచి ఏకాభిప్రాయం
- మధుయాష్కి గౌడ్ కు మొండిచేయి
- పంతం నెగ్గించుకున్న ముఖ్యమంత్రి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా ఎవరు నియమిస్తారు అనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. పీసీసీ చీఫ్ పదవిపై కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్రంగా కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. సామాజిక సమీకరణలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి పదవి రెడ్డి సామాజిక వర్గం చేపట్టింది. డిప్యూటీ సీఎం గా ఎస్సీకి అవకాశం కల్పించారు. దీంతో పీసీసీ అధ్యక్షుడి పదవిని బీసీకి ఇవ్వాలని హస్తం పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ బీసీల్లో బలంగా సామాజిక వర్గాల్లో ఒకటి గౌడ సామాజిక వర్గం. దీంతో ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉన్న మహేశ్ కుమార్ గౌడ్ పీసీసీ అధ్యక్షుడిగా నియమిస్తే ఎలా ఉంటుందని అధిష్ఠానం ఆలోచన చేస్తోంది. మహేశ్ కుమార్ గౌడ్ కే పీసీసీ చీఫ్ పదవి దక్కే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. అందుకే ఆయన ఢిల్లీ వెళ్లినట్లు అంచనా వేస్తున్నారు. పీసీసీ నియామకంతో పాటు మంత్రి వర్గ విస్తరణకు కాంగ్రెస్ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంత్రి పదవులు, పీసీసీ అధ్యక్ష పదవిపై పార్టీ పెద్దలతో చర్చ జరిపినట్లు తెలుస్తోంది. పీసీసీ పదవికి బీసీ ఇవ్వాలనకుంటే మహేశ్ కుమార్ గౌడ్ పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. బీసీకి పీసీసీ పదవి ఇస్తే ఎస్టీ లంబాడకు చీఫ్ విప్ ఇచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఇక తెలంగాణలో బీసీల్లో మరో బలమైన సామాజిక వర్గం ముదిరాజ్ సామాజిక వర్గం. ఈ సామాజికవర్గానికి ఈసారి మంత్రి ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి దక్కే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇసారి ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలకు మంత్రి పదవులు రానున్నాయి.

# చుండ్రు-నివారణ



డాండ్రఫ్ లేదా చుండ్రు. ఇది చాలా మందిని ఇబ్బంది పెట్టే సమస్య. ఈ చుండ్రు సమస్య పోయినట్లే పోయి మళ్లీ మళ్లీ వస్తుంటుంది. డాండ్రఫ్ ముఖ్యంగా ఒక ఫంగస్ వల్ల వస్తుందనేది తెలిస్తే మీకు ఆశ్చర్యం కలగచ్చు.చుండ్రు దాదాపు మనందరి చర్మంపై సహజంగానే ఉంటుంది. కానీ, మనలో దాదాపు సగం మందికి ఇదొక సమస్యగా మారుతుంది.వారిలో కూడా మూడింట ఒక వంతులో ఈ సమస్య ఏ స్థాయికి చేరుతుందంటే, చుండ్రు వల్ల వారికి బయటకు వెళ్లాలంటేనే కష్టమైపోతుంది.చెప్పాలంటే డాండ్రఫ్ సమస్య అనేది చాలా మామూలు సమస్య.కానీ, పది మందిలో ఉన్నప్పుడు కొన్నిసార్లు ఇది మనల్ని సిగ్గుపడాల్సిన పరిస్థితిలో పడేస్తుంది.

**డాండ్రఫ్‌కు భయపడాలా...**

- చుండ్రు వల్ల బయట ఏవైనా కార్యక్రమాలకు వెళ్లడం, ఎవరినైనా కలవడం లాంటివి తగ్గించేశామని చాలా మంది చెబుతుంటారు. ఎందుకంటే చుండ్రు వల్ల వారికి అది ఇబ్బందిగా ఉంటుంది.
- కానీ, చుండ్రుకు అంతగా భయపడాల్సిన అవసరంలేదు. దీనిని వదిలించుకోడానికి కొన్ని ప్రభావవంతమైన పద్ధతులు ఉన్నాయి.
- మన వెంట్రుకల్లో డాండ్రఫ్‌కు ప్రధానంగా మాలాసిజియా గ్లోబోసా అనే ఫంగస్ కారణం అవుతుంది.
- మన చర్మం, వెంట్రుకల్లో సహజంగా ఉన్న నూనెను ఈ ఫంగస్ పీల్చేసుకుంటుంది. కానీ, అదే సమయంలో ఈ ఫంగస్ ఓలెయిక్ యాసిడ్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ యాసిడ్ వల్ల మన తలపైన దురద పెట్టడం మొదలవుతుంది.
- ఈ ఫంగస్ కొంతమందిలో రోగనిరోధక స్పందనను కూడా అడ్డుకుంటుంది. దాంతో తలపైన చర్మం పొడిబారిపోయి పొక్కులు రావడం మొదలవుతుంది.

**చుండ్రు నుంచి ఉపశమనం ఎలా...**

- సూర్యుడి నుంచి వచ్చే యూవీ కిరణాలు ఈ పరిస్థితిని నియంత్రించడానికి సాయం చేసినా, వాయు కాలుష్యం ఈ చుండ్రును మరింత ఘోరంగా మారుస్తుంది.
- ఇలాంటి సమయంలో చుండ్రు నుంచి ఉపశమనం పొందడానికి తలకు నూనె రాయడం అనేది అస్సలు మంచిది కాదు.
- మాలాసెజియా గ్లోబోసా అనే ఫంగస్ మన జుట్టు, చర్మంలో సహజంగా ఉన్న నూనెను పీల్చేస్తుంది. అందుకే తలకు పెట్టిన నూనెను కడిగేయడం, లేదా శుభ్రం చేసుకోవడం అనేది మరింత ఉపయోగకరంగా ఉంటుంది.
- అయితే, కొన్ని రసాయనాల సాయంతో చుండ్రును వదిలించుకోవచ్చు. వీటిలో అత్యంత ప్రభావంతమైనది యాంటీఫంగల్ కెమికల్ మైకోనాజోల్, కెటోకానాజోల్.
- కొన్ని షాంపూల్లో కెటోకానాజోల్ ఉపయోగిస్తున్నారు. కానీ మైకోనాజోల్ మాత్రం ప్రస్తుతం స్కిన్ క్రీమ్‌లా అందుబాటులో ఉంది.
- అయితే, జంతువుల కోసం అందుబాటులో ఉన్న కొన్ని షాంపుల్లో మైకోనాజోల్ కెమికల్ ఉంటుంది.

**యాంటీ ఫంగల్ షాంపూ...**

అయితే, యాంటీ ఫంగల్ షాంపూల ప్రభావం కొంత కాలం తర్వాత మీకు తగ్గినట్లు అనిపించవచ్చు. అందుకే చుండ్రు వదిలించుకోడానికి మీరు అప్పుడప్పుడూ వేరే ప్రత్యామ్నాయాలు ఉపయోగించాల్సి ఉంటుంది. కోల్ టార్ షాంపూ చర్మం టర్నోవర్ ప్రక్రియను నెమ్మది చేస్తుంది. దీనితోపాటూ తలపై పొక్కులు రాకుండా ఉపశమనం పొందడానికి సాలిసిలిక్ యాసిడ్ ఉన్న షాంపూ ఉపయోగించవచ్చు. అయితే, జింక్ లేదా సెలేనియం ఉన్న షాంపూలు కూడా ఫంగస్‌ను అడ్డుకోవడానికి సాయం చేస్తాయి. పరిశోధకులు మాలాసెజియా జెనెటిక్ కోడ్‌ను సీక్వెన్స్ చేశారు. దీని సాయంతో ఈ ఫంగస్‌ను వదిలించుకోడానికి మరింత ప్రభావవంతమైన మందులను అభివృద్ధి చేస్తున్నారు. చుండ్రు తీవ్రంగా ఉంటే మనం ఏదైనా యాంటీ డాండ్రఫ్ షాంపూ ఉపయోగించడం అనేది అత్యంత సులభమైన, మంచి పద్ధతి. యాంటీ డాండ్రఫ్ షాంపూల్లో మనకు చాలా రకాల బ్రాండ్స్ లభిస్తాయి. ఈ కింది రసాయనాలు ఉన్న షాంపూలు ఉపయోగించి చుండ్రు వదిలించుకోవచ్చు.

**డాండ్రఫ్‌కు కారణం..**

**డాండ్రఫ్ అనేది ఒక సాధారణ చర్మం స్థితి. మామూలుగా ముదురు రంగులో ఉండే చుండ్రు పొక్కులు జుట్టులో స్పష్టంగా కనిపిస్తాయి.ఈ సమస్య మరింత తీవ్రం అయితే, డాండ్రఫ్ భుజాలపై కూడా కనిపిస్తుంది.ఆ పరిస్థితిలో మనకు నెత్తిన పొడిబారినట్లు అనిపిస్తుంది. దురద కూడా ఉండవచ్చు.పరిశుభ్రంగా లేకపోవడం వల్ల చుండ్రు పెరగడం ఉండదు. అయితే, మీరు మీ జుట్టును శుభ్రంగా ఉంచుకోకపోతే డాండ్రఫ్ మరింత స్పష్టంగా కనిపిస్తుంది.ఒత్తిడి వల్ల, చలి వాతావరణంలో చుండ్రు వచ్చే ప్రమాదం గణనీయంగా పెరుగుతుంది.**

- * జింక్ పైరీథియోన్
- * సాల్సిలిక్ యాసిడ్
- * సెలీనియం సల్ఫైడ్
- * కెటోకానాజోల్
- * కోల్ టార్

చుండ్రు సమస్య తీవ్రంగా ఉంటే దాదాపు ఒక నెల పాటు యాంటీడాండ్రఫ్ షాంపూ ఉపయోగించి చూడాలి.మీరు కావాలంటే ఒకటి కంటే ఎక్కువ యాంటీ డాండ్రఫ్ షాంపూలు ఉపయోగించి చూడవచ్చు. దాని వల్ల ఏ షాంపూ మీ చుండ్రు వదిలించడానికి బాగా పనిచేస్తోందో మీకు తెలుస్తుంది.

**డాక్టర్ మనోజ్**
హెల్త్ ఆఫీసర్



# నేపాల్‌లో నదిలో పడిన బస్సు

- 27 మంది మృతి
- పలువురికి గాయాలు
- నేపాల్లోని పొఖారా నుంచి కాఠ్‌మాండూకు వెళ్తుండక ఘటన

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

నేపాల్లో ఓ బస్సు నదిలో పడి 27 మంది మరణించారు. పలువురు గాయపడ్డారు. పదుల సంఖ్యలో ప్రయాణికులతో నేపాల్లోని పొఖారా నుంచి కాఠ్మండూకు బయలుదేరిన బస్సు, తనాహున్ జిల్లాలోని ఐరా పహారా ప్రాంతంలో మార్స్యంగ్డి నదిలో పడిపోయింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.ఉత్తర్రప్రదేశ్ రిజిస్ట్రేషన్(UP 53 FT 7623) ఉన్న ఓ ట్రావెల్స్ బస్సు నేపాల్లోని పొఖారా నుంచి కాఠ్‌మాండూకు వెళ్తోంది. ఈ క్రమంలో తనాహున్ జిల్లాలోని ఐరా పహారా ప్రాంతానికి చేరుకోగానే బస్సు అదుపుతప్పి మర్స్యాంగ్డి నదిలో పడిపోయింది. ఈ ప్రమాదం శుక్రవారం ఉదయం 11.30గంటలకు జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటన గురించి సమాచారం అందుకున్న నేపాల్ ఆర్మీ సహాయక చర్యల కోసం రంగంలోకి దిగింది. 45మందితో కూడిన రెస్క్యూ టీమ్ ప్రమాదస్థలికి చేరుకుని 29మంది ప్రయాణికులను రక్షించి ఆస్పత్రికి తరలించింది. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు తెలియాల్సి ఉంది.

మరోవైపు, నేపాల్ ప్రభుత్వం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. నేపాల్ ఆర్మీకి చెందిన MI 17 హెలికాప్టర్లో మెడికల్ టీమ్ను ఘటనాస్థలికి పంపించింది. ఇదిలా ఉండగా, ఈ దుర్ఘటనపై ఉత్తరప్రదేశ్ కు చెందిన ఓ అధికారి స్పందించారు. అక్కడి స్థానిక అధికారులతో మాట్లాడి సమాచారం తెలుసుకుంటున్నట్లు వెల్లడించారు.

గత నెలలో కూడా నేపాల్లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కొండచరియలు విరిగిపడటం వల్ల 65మంది ప్రయాణికులతో వెళ్తున్న రెండు బస్సులు త్రిశూలి నదిలో పడిపోయాయి. ఈ దుర్ఘటనలో మృదేహాల కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాలు నదిలో 100 కిలోమీటర్ల మేర కొట్టుకుపోయాయి. భారత్ నుంచి 12మంది సభ్యుల ఎన్డీఆర్ఎఫ్ బృందం కూడా రెస్క్యూ ఆపరేషన్లలో పాల్గొంది. ఆ నదిలో కొట్టుకుపోయిన బస్సులను ఇంకా కనుగొనలేదు. ఈ ప్రమాదంలో గల్లంతైన ఏడుగురు భారతీయులలో ఐదుగురి మృతదేహాలు లభ్యమయ్యాయి. ఇంకా ఇద్దరి ఆచూకీ దొరకలేదు

# కుర్చీలోనే గర్భిణి ప్రసవం

- ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది నిర్వాకం
- నిండు గర్భిణికి బెడ్ ఇవ్వని ఆస్పత్రి సిబ్బంది
- నల్లగొండ జిల్లా దేవరకొండలో దారుణం

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**



నల్గొండ జిల్లాలో అమానవీయ ఘటన చోటు చేసుకుంది. సిబ్బంది నిర్లక్ష్యంతో ఓ గర్భిణీ కుర్చీలోనే ప్రసవించిన ఘటన నల్గొండ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం రాత్రి జరిగింది. బాధితురాలి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుగొమ్మ మండల కేంద్రానికి చెందిన నల్లవెల్లి అశ్విని అనే గర్భిణీకి గురువారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే, అక్కడి వైద్యులు మూడో కాన్పు చేయడం కుదరదంటూ.. నల్గొండ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలని పంపించారు. దీంతో ఆమెను అర్ధరాత్రి దాటిన తర్వాత నల్గొండ ఎంసీహెచ్‌లో చేర్చారు.

**సిబ్బంది నిర్లక్ష్యం**

అయితే, అక్కడి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ బెడ్ కానీ ఇతర సౌకర్యాలు కానీ కల్పించలేదు. ఈ క్రమంలోనే ఆమెను నర్సులు బయట కుర్చీలో కూర్చోబెట్టారు. దీంతో ప్రసవ వేదనతో బాధ పడుతూ అశ్వినీ కుర్చీలోనే మగబిడ్డకు జన్మనిచ్చింది. కుర్చీ కింద తీవ్ర రక్తస్రావం కావడంతో ఆస్పత్రి సిబ్బంది హడావుడి చేస్తూ అమెను వార్డులోకి తీసుకెళ్లి చికిత్స అందించారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సిబ్బంది తీరుపై బంధువులు, ఇతర రోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితి మరెవ్వరికీ రాకూడదని.. నిర్లక్ష్యం చేసిన వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలి భర్త ఆంజనేయులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా అదనపు కలెక్టర్ పూర్ణచందర్ వెంటనే ఆస్పత్రికి వచ్చి వివరాలు సేకరించారు. బాధ్యులపై చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని అన్నారు.




# పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ గౌడ్ ?

- సీనియర్ల నుంచి ఏకాభిప్రాయం
- మధుయాష్కి గౌడ్ కు మొండిచేయి
- పంతం నెగ్గించుకున్న ముఖ్యమంత్రి

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా ఎవరు నియమిస్తారు అనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. పీసీసీ చీఫ్ పదవిపై కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్రంగా కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. సామాజిక సమీకరణలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి పదవి రెడ్డి సామాజిక వర్గం చేపట్టింది. డిప్యూటీ సీఎం గా ఎస్సీకి అవకాశం కల్పించారు. దీంతో పీసీసీ అధ్యక్షుడి పదవిని బీసీకి ఇవ్వాలని హస్తం పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ బీసీల్లో బలంగా సామాజిక వర్గాల్లో ఒకటి గౌడ సామాజిక వర్గం. దీంతో ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉన్న మహేశ్ కుమార్ గౌడ్ పీసీసీ అధ్యక్షుడిగా నియమిస్తే ఎలా ఉంటుందని అధిష్ఠానం ఆలోచన చేస్తోంది. మహేశ్ కుమార్ గౌడ్ కే పీసీసీ చీఫ్ పదవి దక్కే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. అందుకే ఆయన ఢిల్లీ వెళ్లినట్లు అంచనా వేస్తున్నారు. పీసీసీ నియామకంతో పాటు మంత్రి వర్గ విస్తరణకు కాంగ్రెస్ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంత్రి పదవులు, పీసీసీ అధ్యక్ష పదవిపై పార్టీ పెద్దలతో చర్చ జరిపినట్లు తెలుస్తోంది. పీసీసీ పదవికి బీసీ ఇవ్వాలనకుంటే మహేశ్ కుమార్ గౌడ్ పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. బీసీకి పీసీసీ పదవి ఇస్తే ఎస్టీ లంబాడకు చీఫ్ విప్ ఇచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఇక తెలంగాణలో బీసీల్లో మరో బలమైన సామాజిక వర్గం ముదిరాజ్ సామాజిక వర్గం. ఈ సామాజికవర్గానికి ఈసారి మంత్రి ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి దక్కే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇసారి ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలకు మంత్రి పదవులు రానున్నాయి.



# డ్రగ్స్ ని నిర్మూలిద్దాం

- సమాజాన్ని మేలుకొలుపుదాం
- ఎమ్మెల్యే శ్రీగణేష్

**విశాలభారతి, కంటోన్మెంట్ :** డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరు కంకనం కట్టుకుని పోరాటం చేయాల్సిన అవసరం ఉందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పిలుపునిచ్చారు. స్థానిక మారేడ్పల్లిలోని ముంగా రామ్మోహన్ రావు ప్రభుత్వ బాలికల కళాశాల లో ప్రజా నాట్య మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రగ్స్ అవేర్నెస్ కార్యక్రమంకు ఆయన ముఖ్యఅతిధి గా పాల్గొన్నారు. అనంతరం శ్రీగణేష్ మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలిద్దాం సమాజాన్ని మేలుకొలుపుదాం అని అన్నారు... మీ చుట్టుపక్కల ఎవరైనా మాదకద్రవాలు వాడుతున్నట్టు మీకు తెలిస్తే వెంటనే పోలీసుకు సమాచారం చేయాలని సూచించారు.ముఖ్యంగా మహిళలకు సెల్ఫ్ డిఫెన్స్ చాలా అవసరమని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు యూనిఫామ్స్ కావాలనిఎమ్మెల్యేకు విన్నవించారు. వెంటనే స్పందించిన ఆయన మూడు రోజుల్లో విద్యార్థులకు యూనిఫాంలు అందజేస్తామని హామీ ఇచ్చారు.స్థానిక కాలేజీ బిల్డింగ్ మరమ్మత్తులకు అవసరమైన నిధులు కూడా ఇస్తామని తెలిపారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తెచ్చి పెట్టాల్సిన బాధ్యతు విద్యార్థుల పై ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సినీ నటుడు కోటేశ్వరరావు, ప్రజానాట్యమండలి సభ్యులు మారన్న,సునీత, కళ్యాణ్, వసీం మరియు కళాశాల ఉపాధ్యాయులు ముజాహిద్ అలీ, తిరుపతయ్య, శంకర్ రెడ్డి, వినయ్, అశోక్, నాగరాణి తదితరులు పాల్గొన్నారు..



# యువతి ఫిర్యాదుతో ఆరుగురిపై కేసు నమోదు

**భీమదేవరపల్లి,విశాలభారతి:** యువతిని మోసం చేసిన వ్యక్తి కుటుంబం పై కేసు నమోదు అయినట్లు ముల్కనూర్ ఎస్సై సాయిబాబు తెలిపారు. వివరాలు ఇలా ... చిడిపి చంద్రకళ చిన్న కోడిపూడి మండలం సీతానగరం గ్రామము ,రాజమండ్రి ముల్కనూర్ గ్రామానికి చెందిన బొల్లంపల్లి రంజిత్ చంద్రకళ,ఇద్దరు ఇష్టపడి సహజీవనం కొనసాగిస్తుండ్రు. ఈ క్రమంలో రంజిత్ స్వగ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులతో ప్రేమ విషయం గురించి మాట్లాడి వస్తా అని రాకపోవడంతో యువతి కుటుంబ సభ్యులతో ముల్కనూర్ కు వచ్చి తన భర్త ఆచూకీ అడగగా రంజిత్ కుటుంబ సభ్యులు నిర్లక్ష్య సమాధానంతో, యువతని బెదిరింపులకు గురి చేసినట్లు తెలిపారు. యువతి ఇచ్చిన కేసు మేరకు రంజిత్ తో పాటు కుటుంబ సభ్యులైన బొల్లంపల్లి రాజు, రామచంద్రం, కనకలక్ష్మి, రమాదేవి, ధనలక్ష్మి ల పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



# టేకుమట్ల గ్రామంలో ఉచిత రక్త పరీక్షల శిబిరం

- హెచ్ఐవి పై అవగాహన కల్పించిన వై ఆర్ జీకేర్ లింక్ వర్కర్ స్కీం

**సూర్యాపేట, విశాలభారతి:** టేకుమట్లలో వై ఆర్ జీకేర్ లింక్ వర్కర్ స్కీం నల్గొండ సంస్థ ఏర్పాటు చేసిన ఉచిత రక్త పరీక్ష శిబిరాన్ని డాక్టర్ పావని మేడం, హెచ్ ఏ సైదులు గ్రామ పంచాయతీ సెక్రటరీ నరసింహారావు రక్త పరీక్షల శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం హెచ్ఐవి మీద ప్రజలకు అవగాహన కల్పించారు .ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పకుండా రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ముఖ్యంగా హెచ్ ఐవి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. హెచ్ఐవి నాలుగు విధాలుగా వ్యాపిస్తుందని అందులో అక్రమ లైంగిక సంబంధాలు, కలుషిత రక్తం మార్పిడి, కలుషిత సూదులు సిరంజిలు వాడటం ద్వారా, హెచ్ఐవి సోకి గర్భవతి అయిన తల్లి నుంచి బిడ్డకు వ్యాపించే అవకాశం ఉందన్నారు. ప్రజలు ఆరోగ్య విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అజాగ్రత్త వహించరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ ఎం పద్మ , అంగన్వాడి టీచర్లు లక్ష్మి, లలిత, ఆశా వర్కర్లు పూలమ్మ, నాగలక్ష్మి, ప్రమీల , విజయరాని వై ఆర్ జి కేర్ సంస్థ జోనల్ సూపర్వైజర్ సుజాత ,గ్రామ లింక్ వర్కర్ సునీత, సహాయ లింక్ వర్కర్ తీగల గోవర్ధన్ యూత్ నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఓఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై సలహాలు అందజేయాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట, విశాలభారతి** ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నూతన ఆర్ఓఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై సలహాలు సూచనలు అందజేయాలని కలెక్టర్ కోరారు. శుక్రవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులు, న్యాయవాదులు, రైతులు, యువకులు, పాత్రికేయులు, నిపుణులతో వర్క్ షాప్ నిర్వహించారు. నూతన రెవెన్యూ చట్టం 2024 బిల్లు అంశాలు, తీసుకురావడంలో ప్రభుత్వ ఉద్దేశాన్ని జిల్లా ఆదనపు కలెక్టర్ రెవెన్యూ బిఎస్ లత వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి నూతన రెవెన్యూ చట్టం రూపొందించాలని ప్రభుత్వం సంకల్పించిందని, దీనిలో భాగంగానే నూతన రెవెన్యూ చట్టం 2024 ముసాయిదా బిల్లు రూపొందించిందని కలెక్టర్ చెప్పారు. నూతన చట్టం రూపకల్పనలో రైతులను, ప్రజలను మేధావులను భాగస్వామ్యం చేయాలనె ఉద్దేశంతో ప్రభుత్వం వర్క్ షాప్ లో నిర్వహించాలని ఆదేశించిందని కలెక్టర్ తెలిపారు. రైతుల భూ రికార్డులు పకడ్బందీగా ఉండాలని ఉద్దేశంతో ముసాయిదా బిల్లుపై మేధావులు విద్యావేత్తలు, రెవెన్యూ అధికారులు, రిటైర్డ్ అధికారులు ,సూర్యాపేట బార్ అసోసియేషన్ సభ్యులు, రైతులు, రైతు సంఘం నాయకులు, తమ సూచనలు అందజేయాలని కలెక్టర్ కోరారు. రైతులు మాట్లాడుతూ చట్ట మార్పు చేసేటప్పుడు భూ సర్వే నిర్వహించాలని, భూమిపై ఉన్న రైతులు మాత్రమే నమోదు చేయాలని తెలిపారు. గ్రామ స్థాయి రెవెన్యూ వ్యవస్థ ఉండాలని, పాత చట్టాలను మార్చి, కొత్త చట్టాలలో ప్రతి సంవత్సరం పహానీలలో నమోదు ఉండాలని, శిస్తు వసూలు మళ్లీ పెట్టాలని, కాస్తు కాలం ఉండాలని ,ఆర్వోఆర్ ను సవరించాలని, పొజిషన్ కాలం ఉండాలని ,కబ్జా ఉన్న రైతులకే పట్టా ఇవ్వాలని, ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి కొత్త చట్టం గురించి తెలపాలని, గ్రామాల వారిగా ఉన్న సర్వే నెంబర్లలో భూమి ఎక్కువగా ఉంటుందని సరిచేయాలని, భూమి అమ్మిన వారి పేర్లను తొలగించాలని, ధరణి పోర్టల్ వల్ల రైతులకు చాలా నష్టం జరిగిందని దాన్ని తీసివేయాలని, ఈ చట్టం ద్వారా గతంలో జరిగిన తప్పులు మళ్ళీ జరగకూడదని, భూములను మ్యాపింగ్ చేయాలని, రైతుబంధు తీసుకుంటున్న రైతుల భూములను పరిశీలించాలని, ఆధార్ నమోదు తో పాటు మరేదైనా కార్డు కంపల్సరిగా తీసుకోవాలని, కొత్త చట్టంలో ఆప్పిల్ ఉండాలని, పొజిషన్ కాలం కూడా ఉండాలని, ప్రభుత్వం చట్టంపై రైతుల అభిప్రాయాలు తీసుకొని చట్టం చేయడం చాలా సంతోషంగా ఉందని, సాదా బైనామా చేసే అధికారం డివిజన్ అధికారులకు ఇవ్వాలని, గిఫ్ట్ రిజిస్ట్రేషన్ లో సర్టిఫికెట్స్ అన్ని అప్లోడ్ చేయాలని, జమాబంధీ జరగాలని, ఏ రైతు అప్పిలైన జిల్లా లెవల్లో అయిపోవాలని, గ్రామాల వారీగా రికార్డులు చేపట్టాలని, భూ సమస్యల అప్పిలేటదారిటీ జిల్లా స్థాయిలో ఉండేలా చూడాలని, ప్రతి గ్రామంలో రెవెన్యూ ఉద్యోగి నియమించాలని వారు కోరారు. ఇంకా ఈ సమావేశానికి రానివారు, నూతన రెవెన్యూ చట్టం ముసాయిదా బిల్లుపై సలహాలు సూచనలు ఏమైనా ఉంటేror2024rev@telangana.gov.in వెబ్సైట్లోనూ అప్లోడ్ చేయవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు వేణుమాధవ్, సూర్యనారాయణ, శ్రీనివాసులు, బార అసోసియేషన్ సభ్యులు సోమేశ్, తాసిల్దార్లు, న్యాయవాదులు, రెవెన్యూ సిబ్బంది, అరిటైర్డ్ అధికారులు, రైతు సంఘం నాయకులు, రైతులు, ప్రజా ప్రతినిధులు ,అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# ఆర్ కే వై టీం చేస్తున్న సేవా అభినందనీయం

- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి కుమార్

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** ఆర్ కే వై టీం చేస్తున్న సేవాకార్యక్రమాలు అభినందనీయమని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మారబోయిన రవి కుమార్ యాదవ్ అన్నారు.గోపన పల్లిలోని నిరుపేదలు, ఫుట్ పాత్ ల పై నివసిస్తున్న అభాగ్యులకు వర్షాలకు తల దాచుకోవడానికి గొడుగుల పంపిణీ కార్ర్యమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పంచి పెట్టారు.ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం వర్షాలకు తలదాచుకోవడానికి గొడుగుల పంపిణీ చేస్తున్న ఆర్ కే వై టీం సభ్యులను రవి కుమార్ అభినందించారు.ఆపదలో ఉన్నవారికి ముందుండి తమ వంతు సహాయంగా ఆర్ కే వై టీం సభ్యులు సహాయ సహకారాలు అందించడం హర్షనీయమన్నారు. వేసవికాలంలో చలివేంద్రాలు, వర్షాకాలంలో గొడుగులు, చలికాలంలో దుప్పట్లు అనేక సేవాకార్యక్రమాలను చేపట్టి పేదవారికి మేమున్నామనే భరోసా కల్పిస్తున్నందుకు టీం సభ్యులకు అభినందిస్తూ ధన్యవాదాలు తెలిపారు. పార్టీలకు అతీతంగా, సేవ చేయడంలో సందయ్య మెమోరియల్ ట్రస్ట్, ఆర్ కే వై టీం సభ్యులు ఎల్లప్పుడూ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో టీం సభ్యులు బిజెపి పార్టీ సీనియర్ నాయకులు ఆకుల లక్ష్మణ్ ముదిరాజ్, జాజి రావు శ్రీనివాస్, రాము, నరేష్, శంకరయ్య పాల్గొన్నారు.



# ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయం

- ఎమ్మెల్యే శ్రీగణేష్

**విశాలభారతి,కంటోన్మెంట్:** ప్రజా సమస్యలను పరిష్కారం చేసేందుకు తన వంతు సహాయం చేస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ స్పష్టం చేశారు. కంటోన్మెంట్ నియోజికవర్గం బోయిన్పల్లి లోని యాదవ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. స్థానికులు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలు తెలుసుకున్న ఆయన వెంటనే స్పందించారు. అదనపు స్లాబ్,బోరుకు నిధులు కేటాయించి పనులను త్వరగా పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ప్రెసిడెంట్ (scb) జంపన ప్రతాప్, ముప్పిడి మధుకర్, ,అరుణ్ యాదవ్, ముఖేష్ యాదవ్, మల్లేష్ యాదవ్, వెంకటేష్ యాదవ్, రాజు యాదవ్, ఓం ప్రకాష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**ఆరోవార్డువాసుల సమస్యలు పరిష్కారం.**

ఆరోవార్డు సీతారాంపురంలోని భారతి ఎన్క్లేవ్ వాసులు కమ్యూనిటీ హాల్, డ్రైనేజ్, వాటర్ సమస్యలను కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీగణేష్ దృష్టికి తీసుకురాగా,ఆయన సానుకూలంగా స్పందించారు. వాటిని త్వరగా పరిష్కరం చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు..ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ప్రెసిడెంట్ (SCB) జంపన్న ప్రతాప్, ముప్పిడి మధు, అరుణ్ యాదవ్, మాలాద్రి, నర్సింగ్ రావు, వెంకటేశ్వరరావు, కిషోర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మియాపూర్‌లో వ్యభిచార ముఠా గుట్టు రట్టు

- జనావాసాల మధ్యే సెక్స్ రాకెట్ నిర్వాకం
- ఇద్దరు యువతులు,ఓ విటుడు, నిర్వాహకుల అరెస్టు



**శేరిలింగంపల్లి,విశాలభారతి:** మియాపూర్ లో గుట్టు చప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠా గుట్టును రట్టు చేశారు మియాపూర్ పోలీసుల. ఎస్ ఓటీ టీమ్,మియాపూర్ పోలీసులు కలిసి ఈ ముఠాను అదుపులోకి తీసుకున్నారు.ఈ మేరకు మియాపూర్ సీఐ దుర్గ రామలింగ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ స్వర్ణపురి కాలనీ లోనీ ఓ ఇంట్లో గుట్టు చప్పుడు కాకుండా ఓ ముఠా వ్యభిచారం నిర్వహిస్తుంది.పక్కా సమాచారంతో గురువారం రాత్రి మాదాపూర్ ఎస్ ఓటీ పోలీసులు, మియాపూర్ పోలీసులు దాడులు చేసి నిర్వాహకురాలితో పాటు ఓ విటుడిని,ఇద్దరు యువతులను అరెస్టు చేశారు.ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నటు తెలిపారు.




# కేటీఆర్ చేసే ఆరోపణలు కోడి గుడ్డు మీద ఈకలు పీకడం లాంటివే

- చేవెళ్ల కాంగ్రెస్ ఇన్చార్జి భీమ్ భరత్.

**విశాలభారతి, చేవెళ్ల:** కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని చిత్తశుద్ధి తో ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రజా సంక్షేమ పాలన పై బిఆర్ఎస్ పార్టీ నాయకుడు కేటీఆర్ చేస్తున్న విమర్షలు, కోడి గుడ్డు మీద ఈకలు పీకినట్టు ఉన్నాయని, చేవెళ్ల కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్చార్జి భీం భరత్ గట్టి కౌంటర్ ఇచ్చారు. శుక్రవారం నాడు స్థానిక మండల, జిల్లా స్థాయి నాయకులతో ఏర్పాటు చేసిన భారీ పత్రికా సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... కనీసం ఉద్యోగులకి ఒకటో తారీఖు జీతం ఇవ్వలేని బిఆర్ఎస్ ప్రభుత్వం నేడు కాంగ్రెస్ ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్న హామీలను చూసి ఓర్వలేక దిగజారుడు ఆరోపణలు చెయ్యడం హాస్యాస్పదం అన్నారు.ఉద్యోగాలకు ఒకటో తారీఖు జీతాల పంపిణీ మొదలు, మహిళల కు ఉచిత బస్ సౌకర్యం, రైతు రుణమాఫీ లాంటి హామీలను ఒక్కొక్కటిగా చిత్తశుద్ధితో అమలు చేస్తున్న తీరును భీం భరత్ వివరించారు. ఇప్పటికైనా కేటీఆర్, మరియు ఇతర బిఆర్ ఎస్ నాయకులు ప్రాజా తీర్పుని గౌరవించి మాట్లాడాలని హితవు పలికారు. ఇప్పటికే గత ప్రభుత్వ దొరల పాలకులను ప్రజలు గల్లా పట్టి గద్దె దింపారని తెలిపారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టియుఎఫ్ఐడిసి, చైర్మన్ చల్ల నరసింహారెడ్డి రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్ రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యులు సత్యనారాయణ రెడ్డి సీనియర్ నాయకులు గౌరి సతీష్ మండల అధ్యక్షులు మానయ్య మహేందర్ రెడ్డి నాయకులు వెంకట్ రెడ్డి బద్రప్ప మండల ఉపాధ్యక్షుడు రవి చేవెళ్ళ రాములు సాయి జైపాల్ రెడ్డి సత్యనారాయణ మరియు సీనియర్ జిల్లా స్థాయి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుంచి విముక్తి చేయడమే లక్ష్యం

- డాక్టర్ ఛాయాదేవి

**కూకట్ పల్లి, విశాలభారతి:** సరైన అవగాహన లేకపోవడం వలన ఎంతో మంది మహిళలు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ బారిన పడుతున్నారని డాక్టర్ ఛాయాదేవి అన్నారు. రాబోతున్న కాలంలో మహిళలను గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుంచి విముక్తులను చేయడమే మన లక్ష్యమని పేర్కొన్నారు. కూకట్పల్లి లోని రాందేవ్ హాస్పిటల్ హెచ్పివి ఫ్రీ వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇప్పటికే 1500 మంది కి 9 నుంచి 14 ఏళ్ళ వాళ్లకు ఫ్రీ వ్యాక్సినేషన్ ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ వ్యాక్సినేషన్ కి ఎంతగానో సహకరిస్తున్న హాస్పటల్ యాజమాన్యం విక్రందేవ్ కి,మీరా రావు,అపర్ణ,శ్రీ ప్రశాంత్ రావు,లకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డాక్టర్ కమలాకర్ మాట్లాడుతూ సమాజంలో ఒక గొప్ప మార్పు కోసం ఎంతగానో కృషి చేస్తున్నటువంటి డాక్టర్ ఛాయాదేవి గారికి అభినందనలు తెలిపారు. అలాగే హాస్పిటల్ యాజమాన్యం యొక్క సహకారం ఎల్లప్పుడూ తమకు ఇలాగే ఉండే విధంగా ఉండాలని డాక్టర్ కమలాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కాలేజ్ లోని 50 మంది విద్యార్థినులకు ఫ్రీగా వ్యాక్సినేషన్ అందించడం జరిగింది. నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ అపర్ణ, వైస్ ప్రిన్సిపల్ సెలీనా ఈ సందర్భంగా తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. ఇటువంటి గొప్ప సంస్థకు అనుసంధానంగా ఉన్న కుముదుని దేవి కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కళాశాలలో వర్క్ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అలాగే ఈ ఫ్రీ వాక్సినేషన్ ద్వారా ఆడవారికి రాబోతున్న తరాలలో గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నుంచి కాపాడగలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపర్డెంట్ మేరీ డేవిడ్ గారు, డ్యూటీ డాక్టర్స్ డాక్టర్ శృతి, డాక్టర్ ప్రిన్సి, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ అనూష, డాక్టర్ నవ్య, నర్సింగ్ ఇన్చార్జులు మరియు, అడ్మిన్ మేనేజర్లు కల్పన,రమ,శ్రవణ్ రెడ్డి,క్రాంతి కుమార్, భారతి,శ్రీనివాసరావు ,సురేష్,రాజు, రుద్ర, సుగుణరావు,నాగేంద్ర, రణదీప్, రవీంద్ర, లలిత ,యాస్మిన్ తదితరులు పాల్గొన్నారు

# అనిల్ అంబానీపై సెబీ నిషేధం

- రూ.25 కోట్లు జరిమానా
- మరో 24 సంస్థలపైనా నిషేధం
- నిధుల మళ్లింపు ఆరోపణల నేపథ్యంలోనే చర్యలు
- మార్కెట్లతో సంబంధం ఉండే ఎలాంటి కార్యకలాపాల్లోకి పోవద్దు

విశాలభారతి,వెబ్ డెస్క్:

ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ స్టాక్‌మార్కెట్ లో ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించకుండా సెబీ 5 ఏళ్ల పాటు నిషేధం విధించింది. 'రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్' లో కీలకంగా వ్యవహరించిన మాజీ అధికారులు సహా, మరో 24 సంస్థలపైనా నిషేధం విధిస్తున్నట్లు శుక్రవారం వెల్లడించింది. నిధుల మళ్లింపు ఆరోపణల నేపథ్యంలోనే ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. అనిల్ అంబానీపై సెబీ రూ.25 కోట్ల జరిమానా కూడా విధించింది. సెక్యూరిటీ మార్కెట్లతో సంబంధం ఉండే ఎలాంటి కార్యకలాపాల్లోనూ పాల్గొనకూడదని ఆంక్షలు విధించింది. ఏ నమోదిత కంపెనీ, సెబీలో రిజిస్టర్ అయిన మధ్యవర్తిత్వ సంస్థల్లో డైరెక్టర్ సహా ఎలాంటి కీలక పదవుల్లో ఉండకూడదని ఆదేశించింది. మరోవైపు రిలయన్స్ హోమ్ ఫైనాన్స్‌ను సైతం సెక్యూరిటీ మార్కెట్ల నుంచి ఆర్నెళ్ల పాటు నిషేధించింది. పైగా రూ.6 లక్షల జరిమానా కూడా విధించింది.

అనిల్ అంబానీ తన అనుబంధ సంస్థలకు రుణాల రూపంలో ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్ నిధులను మళ్లించారని సెబీ తమ నివేదికలో ఆరోపించింది. ఇందుకోసం కంపెనీకి చెందిన కీలక నిర్వహణాధికారులతో కలిసి కుట్ర పన్నారని పేర్కొంది. ఆర్‌ఎఫ్‌హెచ్‌ఎల్ డైరెక్టర్ల బోర్డు నిలువరించే ప్రయత్నం చేసినప్పటికీ, వాటిని యాజమాన్యం ఏమాత్రం ఖాతరు చేయలేదని తెలిపింది. అనిల్ అంబానీ ఆదేశాలతోనే, కీలక అధికారులు కావాలని నిబంధనలను అతిక్రమించారని సెబీ ఆరోపించింది.

201819 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ పలు కంపెనీలకు ఎలాంటి పూచీకత్తు లేకుండా భారీ ఎత్తున రుణాలు మంజూరు చేసింది. అయితే ఈ కంపెనీలు అన్నీ ఆర్థికంగా అత్యంత బలహీనమైనవి లేదా నష్టాల్లో ఉన్నవి కావడం గమనార్హం. ఇలాంటి సంస్థలకు ఎలాంటి తాకట్టు లేదా సెక్యూరిటీ లేకుండా, ఇంత పెద్ద ఎత్తున రుణాలు ఇవ్వడం ద్వారా అనిల్ అంబానీ పెద్ద ఎత్తున ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్లు సెబీ గుర్తించింది. అంతేకాదు RHFL నుంచి జీపీసీ రుణాలు పొందిన వారు, నిధులు పొందుతున్న సంస్థలు అన్నీ ప్రమోటర్ గ్రూప్తో సంబంధాలు కలిగి ఉన్నట్లు సెబీ ఇన్వెస్టిగేషన్లో తెలిసింది. ఫలితంగా ఆర్‌ఎఫ్‌హెచ్‌ఎల్ దివాలా తీసి ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం పరిష్కార ప్రణాళికకు వెళ్లాల్సివచ్చింది. తద్వారా పబ్లిక్ షేర్‌హోల్డర్లు భారీగా నష్టపోయారని సెబీ పేర్కొంది.

ఉదాహరణకు 2018లో కంపెనీ షేరు ధర రూ.59.60 వద్ద ఉండగా, 2020 నాటికి కంపెనీ మోసం బయటకు రావడం, నిధులు అడుగంటిపోవటంతో షేరు విలువ రూ.0.75కు పడిపోయినట్లు సెబీ గుర్తుచేసింది. ఇప్పటికీ 9 లక్షల మంది షేర్హోల్డర్లు నష్టాలతో కొనసాగుతున్నారని వివరించింది.



సెబీ అనిల్ అంబానీపై రూ.25 కోట్లు, ఆర్హెచ్ఎఫ్ఎల్ మాజీ సీఎఫ్ఓ అమిత్ బాప్నాపై రూ.27 కోట్లు, ప్రస్తుతం ఆర్హెచ్ఎఫ్ఎల్ సీఈఓ రవీంద్ర సుదాల్కర్పై రూ.26 కోట్లు, ప్రస్తుత సీఎఫ్ఓ పింకేశ్ షాపై రూ.21 కోట్ల మేర జరిమానా విధించింది. అంతేకాదు ఈ మోసపూరిత పథకంతో సంబంధమున్న సంస్థలపైనా రూ.25 కోట్లు చొప్పున ఫైన్ వేసింది. 2022లోనూ సెబీ వీరందరిపై నిషేధం విధించడం గమనార్హం.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com
జనరల్ న్యూస్




# గ్రామాల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధి

- గ్రామసభలలో మాట్లాడుతున్న గుండాల ఎంపిటిసి గొంగడి వెంకటరామిరెడ్డి

**భద్రాచలం, విశాలభారతి:** ఎటపాక మండలం గుండాల గ్రామ సచివాలయ పరిధిలోని గుండాల కాలనీ మరియు పురుషోత్తపట్నంలో జరిగిన గ్రామసభల్లో గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి వందరోజుల వేతన ఉపాధి, మరియు పనిచేసిన 15 రోజుల్లోపు వేతనాలు చెల్లింపు,స్త్రీ పురుషులకు సమాన వేతనం, పని కోరిన 15 రోజుల్లో పని పొందే హక్కు, పని కోరిన 15 రోజుల్లోపు పని కల్పించినట్లయితే, పని కోరిన తేదీ నుంచి నిరుద్యోగ భృతి పొందే హక్కు, చేసిన పని కొలతలు ఆధారంగా వేతనాలు చెల్లింపు,పనిచేసే ప్రదేశంలో కూలీలకు గాయాలైనట్లయితే, చికిత్స ఖర్చు ప్రభుత్వం నుంచి రాబట్టుకునే హక్కు ఉంటుందని తెలిపారు. అంతేకాకుండా సీసీ రోడ్లు, సిసి డ్రైన్లు, ఇవి మాత్రమే కాకుండా వ్యవసాయ అనుబంధ పనులు,నీటి సంరక్షణ పనులు ,మౌలిక సదుపాయాల కల్పనా పనులు,వ్యక్తిగత లబ్ధి నిచ్చే పనులు,వీటన్నింటి మీద కూడా గ్రామ సభలో మాట్లాడటం జరిగింది.ప్రజల నుంచి వచ్చినటువంటి వినతులన్నీటిని కూడా స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గుండాల సర్పంచ్ గుండి సీతాలక్ష్మి,ఉప సర్పంచ్ తోట శశికుమార్ రావి మాధవరావు, చేకూరి వెంకట రమేష్ ,పంచాయతీ సెక్రటరీలు వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.








# కొంగరలో మరో పరిశ్రమకు శ్రీకారం

- స్థానిక యువకులకు ఉద్యోగ అవకాశాలు
- పాల్గొన్న రాష్ట్ర ఐ.టి పరిశ్రమల శాఖ మంత్రి , జిల్లా ఇంచార్జ్ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు

**ఇబ్రాహింపట్నం , విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపాలిటీలోని కొంగరకాలాన్ లో ఎలక్ట్రానిక్ సిస్టమ్ డిజైన్ , మాన్యు ఫ్యాక్చరింగ్ సొల్యూషన్స్‌లో గ్లోబల్ లీడర్ (కేన్స్) హైదరాబాద్‌లో తన అత్యాధునిక ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రాన్ని రాష్ట్ర ఐ.టి పరిశ్రమల శాఖ, జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, ఇబ్రహీంపట్నం శాసన సభ సభ్యుడు మల్ రెడ్డి రంగారెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ దేశంలో 7 రాష్ట్రాలలో 10 పట్టణాలలో కేన్స్ టెక్నాలజీ సంస్థ విస్తరించి ఉందని, ఇప్పుడు తెలంగాణలో ఏర్పాటు చేయడం శుభ సూచకమని, రూ. 2018 కోట్ల పెట్టుబడితో హైప్రెసిషన్ ఎలక్ట్రానిక్ అసెంబ్లీ, త్రీడి ఆప్టికల్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎనేబుల్ అత్యాధునిక తనిఖీ వ్యవస్థలు, లీడ్‌ఫ్రీ/ఆర్ఓహెచ్ఎస్ కంప్లైంట్ ప్రాసెస్‌లతో సహా తాజా తయారీ సాంకేతికతలను సౌకర్యం కలిగి ఉంటుదని అన్నారు. ఈ ఎలక్ట్రానిక్ సంస్థను ఇక్కడ ఏర్పాటు చేయడం వలన ఈ ప్రాంతము లోని రెండు వేల మంది యువతి యువకులకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఇబ్రహీంపట్నం ప్రాంతము చాలా వెనుకబడిన ప్రాంతమని ఇక్కడి యువతకు ఉపాధి అవకాశములో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని యాజమాన్యాని కోరారు. ఇటీవలే ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయుటకు పనులు ప్రారంభించిందని, దీనితో 4వ పట్టణంగా ఇక్కడి ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, త్వరలో హైదరాబాదుకు మరొక తలమణికంగా రీజనల్ రింగ్ రోడ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు.

**కాలుష్యం లేని సంస్థలకు అన్ని విధాలా సహకారం అందిస్తాం.**
**- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**

ఇబ్రాహీంపట్నం శాసన సభ సభ్యుడు మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ సిస్టమ్ డిజైన్ , మాన్యు ఫ్యాక్చరింగ్ సొల్యూషన్స్‌లో గ్లోబల్ లీడర్ అయిన కేన్స్ సంస్థను తమ ప్రాంతంలో ఏర్పాటు చేయడం ఇక్కడి వారి అదృష్టమని అన్నారు. ఇలాంటి కాలుష్యం లేని సంస్థలకు అన్ని విధాలా సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక, కేన్స్ టెక్నాలజీ సంస్థ చైర్మన్ సబిత రమేష్, ఎండి రమేష్ కణ్ణన్, సీఈఓ రఘు పాణికర్, రాష్ట్ర మౌలిక, పారిశ్రామిక కల్పన సంస్థ వైస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీలక్ష్మి, ఇతర ప్రముఖ ప్రభుత్వ అధికారులు, పరిశ్రమల ప్రముఖులు, ముఖ్య భాగస్వాములు పాల్గొన్నారు.

# విలీనం ప్రశ్నేలేదు

- బీఆర్ఎస్ లాంటి పార్టీని కలుపుకుంటామా?
- రుణమాఫీ పూర్తి స్థాయిలో ఎందుకు ఇవ్వలేదు
- రైతుల్లో రోజురోజుకు అసహనం పెరిగిపోతున్నది
- బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**



బీజేపీలో బీఆర్ఎస్ విలీనం వార్తలపై బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అమలు సాధ్యంకాని హామీలు ఇచ్చిందని, రైతులను, మహిళలను మోసం చేసిందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 30శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ దక్కిందన్నారు. రూ. 2లక్షలు రైతులు ముందు చెల్లించాక ప్రభుత్వం ఇచ్చే రుణమాఫీ ఏంది అని ప్రశ్నించారు. రేవంత్ రొటేషన్ చక్రవర్తి అంటూ అరవింద్ ఎద్దేవా చేశారు.
వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రుణమాఫీ చేసిన తీరు అభినందనీయం. ప్రజల్లో ప్రభుత్వం తీరుపై రోజురోజుకు అసహనం పెరుగుతుందని అరవింద్ అన్నారు. బీజేపీ తలపెట్టిన రేపటి రైతు దీక్షను విజయవంతం చేయాలని బీజేపీ శ్రేణులను, ప్రజలను కోరారు. కేసీఆర్ లాగే రేవంత్ రెడ్డి కూడా అబద్ధాలు చెబుతూ కాలం వెల్లదీస్తున్నాడని విమర్శించారు. షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని అరవింద్ డిమాండ్ చేశారు.బీజేపీలో బీఆర్ఎస్ విలీనం వార్తలపై అరవింద్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ బీజేపీలో విలీనం అవ్వటం సాధ్యం కాదన్నారు. బీఆర్ఎస్ ను దగ్గరకు రానిచ్చే ప్రసక్తే లేదని అరవింద్ అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరారు.. కాబట్టి బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలో విలీనం అయినట్లేనని అన్నారు. పార్టీ అభ్యర్థులను, పార్టీని గెలిపించే వారినే రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకోవాలని పార్టీ అధిష్టానానికి ఎంపీ అరవింద్ సూచించారు.



# రోగులకు పండ్లు , బ్రెడ్ పంపిణీ

**కరకగూడెం, విశాలభారతి:** మండల పరిధిలోని ప్రభుత్వ వైద్యశాల, వివిధ పాఠశాలలు,అంగన్వాడీలలో పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. వివరాల్లోకి వెళితే కరకగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ ప్రథమ కుమారుడు ఆరిఫ్ & రఫీయ దంపతుల కవల పిల్లలు అయినా ఆర్ఫియ, అసిఫా మొదటి జన్మదిన సందర్భంగా ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ వైద్య అధికారి కారం మధు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకలు పేద ప్రజల మధ్యన జరుపుకోవాలని ఆకాంక్షతో మా మనవరాళ్లకు ప్రజల దీవెనలు అందుతాయని ప్రజలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, పత్రికా సోదరులు తదితరులు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ నాయకులు ధర్నాలు చేయడం హాస్యాస్పదం

**నడిగూడెం, విశాలభారతి:** రైతు రుణమాఫీపై బిఆర్ఎస్ నాయకులు ధర్నాలు చేయడం హాస్యాస్పదమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బూత్కూరి వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రుణమాఫీ పైన బిఆర్ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసి రైతుల కళ్ళల్లో ఆనందం వ్యక్తం అవుతుందని అది చూసి బిఆర్ఎస్ నాయకులు తట్టుకోలేక కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం పైన దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసి చూపిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. గత బిఆర్ఎస్, బిజెపి ప్రభుత్వాలు రైతులను నట్టేట ముంచాయని లక్ష రూపాయల రుణమాఫీ చేయడానికి నాలుగు సంవత్సరాలు టైం తీసుకొని రైతులకు రుణమాఫీ చేయకుండా 10 శాతం ఉన్న సంపన్నుల కోసం పనిచేశారని ఎద్దేవా చేశారు. సాంకేతిక లోపాల వల్ల కొంత మంది రైతులకు రుణమాఫీ కాలేదని రుణమాఫీ కానీ రైతులందరికి రుణమాఫీ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కావాలని బిఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించి వారి ఉనికిని కాపాడుకోవడం కోసం రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. కోదాడ, హుజూర్నగర్ నియోజకవర్గాల అభివృద్ధి కోసం లక్షల కోట్ల రూపాయలు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తున్న ఘనత మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి లకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు దున్న శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి వేపూరి సుధీర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మొక్క బిక్షపతి, బాణాల నాగరాజు, విజయ రామారావు, దున్న లింగయ్య, దున్న నాగరాజు, వెంకటరెడ్డి బాణాల సతీష్, దున్న శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# కరెంటు కోతలకు స్వస్తి పలకండి

**పాలకీడు, విశాలభారతి:** పట్టణ, పరిసర గ్రామాల ప్రజలు అడ్డు అదుపు లేని కరెంటు కోతలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని కరెంటు కోతలు నివారించేందుకు ట్రాన్స్కో ఏ ఈ చర్యలు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన నేరేడుచర్ల విద్యుత్ కార్యాలయంలో సిపిఐ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చిన అనంతరం ఆయన మాట్లాడుతూ అసలే తీవ్రమైన ఉక్కపోత తో ప్రజలు అల్లాడుతున్నారని, విపరీతమైన దోమల వల్ల చికున్ గున్యా, డెంగ్యూ,మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు.ఓ పక్క ప్రభుత్వ దవాఖానాల్లో సరైన వైద్యం, మందులు,ల్యాబ్ లు అందుబాటులో లేక ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తుంటే టెస్టుల పేరిట, మందుల పేరిట వేలాది రూపాయలు రోగుల నుంచి దోపిడి చేస్తున్నారని అన్నారు.మెడికల్ మాఫియా రింగ్ లా ఏర్పడి స్థానిక ఆర్ మ్ పి డాక్టర్ల ద్వారా పేషెంట్లను రప్పించుకుని వారి ఇల్లు, ఒళ్ళు గుల్ల చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. గ్రామాల్లో చిరుజల్లు పడినా గంటలకొద్దీ కరెంటు తీసివేస్తున్నారని, కొద్దిపాటి గాలి వీచినా కరెంటు కోతలు విధిస్తున్నారని, ఊర్లలో గాలి రాకుండా వర్షాకాలంలో జల్లులు పడకుండా ఉంటాయా అని ఆయన ప్రశ్నించారు. అయినదానికి కానిదానికి, చీటికిమాటికి కరెంటు కోతలు విధిస్తున్నారని, గత వారం రోజులుగా రోజుకు 20 నుంచి 25 సార్లు కరెంటు తీసివేస్తున్నారని, ముఖ్యంగా రాత్రి వేళలో కరెంటు పోతే తిరిగి ఎప్పుడోస్తుందో తెలియదని పరిస్థితి నేరేడుచర్లలో నెలకొని ఉన్నదని అన్నారు. కార్యక్రమంలో పట్టణ సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు ఊదర వెంకన్న, మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ లక్ష్మి, రైతు సంఘం మండల కార్యదర్శి కటికోల వెంకన్న, యువజన సమాఖ్య నాయకుడు కొండా నవీన్ పాల్గొన్నారు.



# త్రివేణి విద్యా సంస్థపై చర్యలేవి

**భద్రాచలం, విశాలభారతి:** పట్టణంలో త్రివేణి విద్యా సంస్థ ఆగస్టు 15వ తేదీ రోజున జాతీయ జెండాని ఫుట్ పాత్ పై ఎగరవేశారు. త్రివేణి విద్యా సంస్థకి సంబంధించిన ప్రభుత్వ అనుమతులు లేనప్పటికీ విద్యాసంస్థని నడుపుతున్నారు. ఈ సందర్భంగా మునిగేలా శివ ప్రశాంత్ మాట్లాడుతూ ఇప్పటివరకు త్రివేణి విద్యా సంస్థపై చర్యలు తీసుకోకుండా విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన అన్నారు. త్రివేణి విద్యా సంస్థకి ఏజెన్సీ చట్టాలని పక్కదారి పట్టించి స్కూల్ పర్మిషన్స్ తీసుకోకుండా ఆర్థిక బలంతో రాజకీయ బలంతో అధికారులను మేనేజ్ చేస్తూ స్కూల్ నడుపుతున్నారని ఆయన ఆరోపణ చేసినారు. విద్యాశాఖ అధికారులు ఆ స్కూల్ పై ఎందుకు అంత ప్రేమ చూపిస్తున్నారని గల కారణాలు ఏంటో ప్రజానీకానికి తెలియజేయాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఈఓ డిఈఓ లు ప్రవేట్ విద్యాసంస్థలు ఇస్తున్న ఆర్థిక సంబంధాలు పెట్టుకుని ఏజెన్సీ చట్టాలను ప్రజల్ని మోసం చేస్తూ కాలయాపన చేస్తున్నారనీ ఆరోపించారు. అందుకో సమని త్రివేణి విద్యా సంస్థపై చర్యలు తీసుకోవడం లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంజు, మోషన్, మల్లయ్య ,సంపత్ తదితరులు పాల్గొన్నారు.




# గంజాయితో పట్టుబడ్డ వ్యక్తి అరెస్ట్

**భీమదేవరపల్లి,విశాలభారతి:** మండలంలో పరిధిలోని కొత్తపెల్లి గ్రామ శివారులో పోలీసు లు శుక్రవారం నిర్వహించిన తనిఖీలలో ఓ వ్యక్తి గంజాయితో పట్టుపడ్డాడు. సిఐ పులి రమేష్ తెలిపిన వివరాల మేరకు హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం పెగడపల్లి గ్రామానికి చెందిన మాట్ల దిలీప్ వద్ద నుండి 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దిలీప్ గంజాయి తాగడానికి అలవాటు పడి నాగపూర్ నుండి గంజాయి తీసుకు వస్తున్నాడు. తాను వినియోగిస్తూ తన అవసరాల కోసం గంజాయిని అమ్మేవాడు. ఈ క్రమంలో శుక్రవారం కొత్తపెల్లి గ్రామ శివారులో గంజాయితో పట్టు పడ్డాడని అతనిపై కేసు నమోదు చేసి కోర్టు కు హాజరు పరిచినట్లు తెలిపారు. గంజాయి పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ముల్కనూర్ ఎస్సై సాయిబాబు, హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వర్ రావు, తిరుపతి, మోహన్ బాబు, వెంకటేశ్వర్లు, శోభన్ బాబు, శివరాజు, సదానందం, రాజు లను సిఐ అభినందించారు.

# ఆగస్టు 29న, రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీలలో" డిమాండ్స్ డే "

- ఉద్యోగులారా విజయవంతం చేయండి
- బియాని జ్ఞానేశ్వర్

**సికింద్రాబాద్ ,విశాలభారతి:** ఆగస్టు 29న, రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో చేపట్టిన డిమాండ్స్ డే విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు జ్ఞానేశ్వర్ కోరారు. విశ్వవిద్యాలయాలు , ఉద్యోగులు , ఎదుర్కొంటున్న పలు సమస్యలపై మరియు వెంటనే అన్ని విశ్వవిద్యాలకు వైట్ ఛాన్స్లర్స్ (వీసీ ) ,లను నియమించాలని ,పెండింగ్ లో ఉన్న 4 డీఎ లను వెంటనే విడుదల చేయాలని ,నూతన పిఆర్సీని అమలు చేయాలని , యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాల్లో జరగనున్న డిమాండ్ డే విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు వియ్యాని జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు. సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి విధానాన్ని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని , ఖాళీగా ఉన్న బోధన ,బోధనేతర ఖాళీలు భర్తీ చేయాలని , పాలక మండలిలో బోధనేతర ఉద్యోగులకు సభ్యులుగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. టైం స్కేల్ ఉద్యోగుల ను రెగ్యులర్ చేయాలని , ఔట్సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా యూనివర్సిటీ ఉద్యోగులకు హెల్త్ కార్డ్స్ ఇవ్వాలన్నారు. రాష్ట్ర కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ లో 6 % శాతం ఉన్నత విద్యాకు నిధులు కేటాయించాలన్నారు. నాన్ టీచింగ్ అడ్మినిస్ట్రేషన్ పోస్టులో ప్రొఫెసర్స్ ను నియమించరాదన్నారు.హెల్త్ సెంటర్ లో పర్మినెంట్ వైద్యులను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్ని విశ్వవిద్యాలయ బోధనేతర ఉద్యోగులు విశ్వవిద్యాలయల పరిపాలన భవనల ఎదుట డిమాండ్స్ డే లో విధిగా పాల్గొని విజయవంతం చేయాలని జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు



# నడిగూడెంలో వ్యాసరచన పోటీలు

**నడిగూడెం, విశాలభారతి:** మండలం కేంద్రంలో జెడ్ పి హెచ్ ఎస్ నడిగూడెం పాఠశాలలో మండలంలోని అన్ని పాఠశాలల్లో 8, 9,10 తరగతులు చదివే విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన,వకృత్వ పోటీలను నిర్వహించారు.ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ గారి చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. వ్యాసరచన పోటీలో ప్రథమ బహుమతి కరివిరాల ఆదర్శ పాఠశాలకు చెందిన ఎ. తనుశ్రీ, ద్వితీయ బహుమతి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నడిగూడెంకు చెందిన షేక్ ఉమేరా, తృతీయ బహుమతి గురుకుల పాఠశాల నడిగూడెంకు చెందిన టి ప్రసన్నా, వకృత్వ పోటీలలో ప్రథమ బహుమతి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని షేక్ నాస్మిన్, ద్వితీయ బహుమతి గురుకుల పాఠశాల విద్యార్థిని పి.కృష్ణవేణి, తృతీయ బహుమతి కరివిరాల ఆదర్శ పాఠశాల విద్యార్థి షేక్.భాషిరత్ నతిష, లు గెలుపొంది బహుమతులు పొందారు. వీరు 27 ఆగస్టు 2024 రోజున జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు హాజరుకావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్పీలు నందిగామ రామారావు రాజుల గురుస్వామి ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, మూర్తి, అహల్య దేవి, మీరాజుద్దీన్, కత్తి వెంకటేశ్వర్లు, సిరాజుద్దీన్, కృష్ణ, కోటయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.



# తడిపొడి పద్ధతిలో వరిసాగు చేస్తే అధిక దిగుబడులు

- సిసి ఎక్స్ రీజనల్ మేనేజర్ చందు

**సైదాపూర్, విశాల భారతి** తడిపొడి పద్ధతిలో వరిసాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని సీసీ ఎక్స్ రీజనల్ మేనేజర్ చందు రైతులకు సూచించారు. సైదాపూర్ మండల కేంద్రంతో పాటు వెన్నంపల్లి గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు. అనంతరం అతను మాట్లాడుతూ రైతులు తడి పొడి పద్ధతిలో వరి సాగు చేయడం వలన అధిక దిగుబడి వస్తుందని అన్నారు. అలాగే తక్కువ నీరుతో ఎక్కువ పంట ఉత్పత్తిని సాధించవచ్చని రైతులకు సూచించారు. వాతావరణంకు ప్రమాదకరమైన మీథేన్ విషవాయువును విడుదల కాకుండా అరికట్టవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ కోఆర్డినేటర్ కానుగంటి బిక్షపతి, రైతులు మహేందర్ రాజబాబు , తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలి

- సూర్యాపేట జిల్లా కేంద్రంలో కదం తొక్కిన విద్యార్థి లోకం




**సూర్యాపేట, విశాల భారతి** విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం 100 ఫీట్ల రోడ్డు నుండి గాంధీ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, డివిజన్ ప్రధాన కార్యదర్శి పిడమర్తి భరత్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇప్పటికీ విద్యాశాఖకు మంత్రిని కూడా కేటాయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని అన్నారు. అదే విధంగా పెండింగ్ స్కాలర్షిప్, ఫీజు దీయింబర్స్మెంట్ సుమారు రూ.8300 కోట్లు బకాయిలుగా ఉన్నాయని ఆరోపించారు. దీనివల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్ లో విద్యకు తగినన్ని నిధులు కేటాయించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం భోజనం పథకాన్ని ఏర్పాటు చేయాలని, సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ, మహిళా డిగ్రీ,యూనివర్సిటీలను ఏర్పాటు చేయాలని, విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడుతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు నాయకులు, కాలేజీ విద్యార్థులు, మమత, సంధ్య, నవ్య, శైలజ, వనజ, శివ, సందీప్,మహేష్,నవీన్ ,వినయ్, వేణు,సాయిరాం, ఉదయ్, గోపి తదితరులు పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- డాక్టర్ దుర్గా భవాని

**పినపాక, విశాలభారతి:** పినపాక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చింతలపాడు గ్రామంలో శుక్రవారం నాడు డాక్టర్ దుర్గాభవాని ఆరోగ్య వైద్య శిబిరం ఏర్పాటుbచేసారు. వైద్య శిబిరంలో రక్త నమూనాలు సేకరించి డెంగ్యూ, టైఫాయిడ్, పరీక్షలు నిర్వహించడంతోపాటు, ఇంటి పరిసరాలు శుభ్రపరచుకోవాలని తమ సిబ్బందితో కలిసి, ప్రతి ఇంటికి వెళ్లి ఇంటి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండాలని వారన్నారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన సదస్సు దాని ఆవశ్యకతను తెలియజేశారు. సీజనల్ వ్యాధులైనటువంటి మలేరియా, డెంగ్యూ జబ్బులను నివారించుటకై ప్రజలంతా తమ బాధ్యతగా చైతన్యవంతంతో తమ ఇండ్లలోని గోళాలు, డ్రమ్ములు, ప్లాస్టిక్ డబ్బాలలోని నీటిలో తోక పురుగులు (దోమల లార్వా లు) లేకుండా క్లీన్ చేసుకోవాలని తెలియజేసారు. గ్రామమంతటా డ్రైడ్ యాక్టివిటీస్(ఆంటీ లార్వల్ ఆపరేషన్), ఫీవర్ సర్వే కండక్ట్ చేసామని తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలల అన్ని రకాల జబ్బులకు రక్త పరీక్షలు నిర్వహించబడతాయని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



## చేయి చేయి కలుపుదాం గంజాయిని నిర్మూలిద్దాం

- ఎస్సై రాజ్ కుమార్

**పినపాక, విశాలభారతి :** చేయిచేయి కలుపుదాం, గంజాయిని నిర్మూలిద్దామని ఏడుల్ల బయ్యారం ఎస్సై రాజకుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఎక్సైజ్ శాఖ ఎస్సై కిషోర్ బాబుతో వారి సిబ్బందితో కలిసి మండల ప్రధాన కేంద్రాలలో అవగాహన కల్పించారు. ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాలతో పినపాక మండలం పరిధిలోని దుగినేపల్లి గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై రాజకుమార్, ఎక్సైజ్ ఎస్ఐ కిషోర్ బాబు మాట్లాడుతూ యువత గంజాయికి, నాటు సారాకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని వారు సూచించారు. గంజాయి సేవించినా, రవాణా చేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని, వారి పేర్లను గోప్యం గా ఉంచుతామని తెలిపారు. గంజాయిని నిర్మూలించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.



## ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి

- మణుగూరు డీఎస్పి రవీందర్ రెడ్డి

**మణుగూరు, విశాలభారతి:** పట్టణంలో ఉన్న ఆటో డ్రైవర్లు అందరూ ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మణుగూరు సబ్ డివిజన్ డీఎస్పి రవీందర్ రెడ్డి అన్నారు. ప్రధాన రహదారులపై ఆటోలను నిర్లక్ష్యంగా నడిపితే వారిపై కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో సీఐ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డీఎస్పి రవీందర్ రెడ్డి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటోలలో పరిధికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని డ్రైవర్లకు సూచించారు. ప్రతి డ్రైవరు తమ ఆటోపై సీరియల్ నెంబర్, ఫోన్ నెంబర్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆటో ఎక్కే మహిళల పట్ల మర్యాదగా నడుచుకోవాలన్నారు. మహిళల పట్ల దురుసుగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హైవేల పట్ల ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని గుర్తు చేశారు. ఆటోని నడిపేటప్పుడు తమ కుటుంబాన్ని ఒక్కసారి గుర్తు చేసుకోవాలన్నారు. మైనర్ పిల్లలను ఆటోలో ఎక్కించుకొని పనికి తీసుకొని వెళితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా తమ పనులు చేసుకోవాలని డ్రైవర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మేడ ప్రసాద్, ఏఎస్సై మోహన్, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## స్వయం సహాయక సంఘం అవగాహన సదస్సు

**కరకగూడెం, విశాలభారతి:** మండల పరిధిలోని స్వయం సహాయక సంఘాల ఏపిఎం త్రిగుణ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలలోని లబ్ధిదారులకు పాడే గేదలు, పెరటి కోళ్ల పెంపకం మదర్ యూనిట్ లబ్ధిదారులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పశు వైద్యాధికారి, శ్రీలత, ఇన్చార్జ్ ఎంపీడీవో దేవ వర కుమార్ హాజరై వారు మాట్లాడుతూ. స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే కోళ్ల పెంపకం గేదెల పెంపకం పై లబ్ధిదారులు అనుసరించాల్సిన విధివిధానాలను మార్కెట్ ధరలకు అనుగుణంగా పెంపకం వాటిని మార్కెటింగ్ ఎలా చేయాలి అనే దానిమీద వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలోపశు వైద్య అధికారి శ్రీలత, స్వయం సహాయక సంఘాల ఏపీఎం, త్రిగుణ, ఎంపి ఓ దేవ వర కుమార్, స్వయం సహాయక సంఘాల సభ్యులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## హెచ్ఐవి పై అవగాహన కల్పించిన వైఆర్జీకేర్ లింక్ వర్కర్ స్కీం

**సూర్యాపేట, విశాలభారతి :** సూర్యాపేట మండల పరిధిలోని టేకుమట్లలో వై ఆర్ జీకేర్ లింక్ వర్కర్ స్కీం నల్గొండ సంస్థ వారు ఏర్పాటు చేసిన ఉచిత రక్త పరీక్ష శిబిరాన్ని డాక్టర్ పావని, హెచ్ ఏ సైదులు, గ్రామ పంచాయతీ సెకరటరీ డి. నరసింహారావు రక్త పరీక్షల శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. అనంతరం హెచ్ఐవి మీద ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పకుండా రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ముఖ్యంగా హెచ్ ఐ వి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. హెచ్ఐవి నాలుగు విధాలుగా వ్యాపిస్తుందని అందులో అక్రమ లైంగిక సంబంధాల ద్వారా, కలుషిత రక్తం మార్పిడి ద్వారా, కలుషిత సూదులు సిరంజిలు వాడటం ద్వారా, హెచ్ఐవి సోకి గర్భవతి అయిన తల్లి నుంచి ,బిడ్డకు వ్యాపించే అవకాశం ఉందని తెలిపారు. అలాగే టిబి, బీపీ, ఎస్.టి.ఐ వంటి పరీక్షలు కూడా చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం పద్మ , అంగన్వాడి టీచర్లు లక్ష్మి, లలిత, ఆశా వర్కర్లు పూలమ్మ, నాగలక్ష్మి, ప్రమీల , విజయరాని వై ఆర్ జి కేర్ సంస్థ జోనల్ సూపర్వైజర్ సుజాత ,గ్రామ లింక్ వర్కర్ సునీత, సహాయ లింక్ వర్కర్ తీగల గోవర్ధన్, యూత్ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

- సివిల్ సప్లై టాస్క్ ఫోర్స్ ఓ ఎస్ డి ద్రోణాచార్యులు

**సూర్యాపేట, విశాలభారతి** పాఠశాల విద్యార్థులకు సన్న బియ్యం ద్వారా వండిన ఆహారం మాత్రమే అందించాలని సివిల్ సప్లై టాస్క్ ఫోర్స్ ఓ ఎస్ డి ద్రోణాచార్యులు అన్నారు. శుక్రవారం కమిషనర్, సివిల్ సప్లై, హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు అడిషనల్ కలెక్టర్ బిఎస్ లత (రెవిన్యూ)తో కలిసి పట్టణంలోని జిల్లా పరిషత్, బాలుర ఉన్నత పాఠశాల నందు మధ్యాహ్నం భోజన పథకం , బియ్యం నాణ్యత సరిగా ఉన్నదా , లేదా స్కూల్స్, హాస్టల్లో బియ్యాన్ని పద్ధతి ప్రకారం భద్రపరచాలని ఆదేశించినారు. ఎక్కడైనా బియ్యం నాణ్యతలో లోపాలు ఉంటే జిల్లా మేనేజర్, సివిల్ సప్లై వారికి తెలిపి వాటిని వెంటనే మార్చి మంచి బియ్యం తీసుకోవాలని ఆదేశించినారు. తదుపరి అడిషనల్ కలెక్టర్ బి.ఎస్.లత (రెవిన్యూ) పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేసే పాఠ్యపుస్తకాలను తనిఖీ చేశారు. పద్ధతి ప్రకారం పుస్తకాలు పంపిణీ చేశారా.. మిగిలిన పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేయాలని సంబంధిత స్కూల్ ఉపాధ్యాయులకు తెలిపారు. అనంతరం పదవి తరగతి క్లాస్ రూమ్ తనిఖీ చేసి విద్యార్థులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై టాస్క్ ఫోర్స్ ఓ ఎస్ డి ద్రోణాచార్యులు, అడిషనల్ కలెక్టర్ బిఎస్. లత, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ ప్రసాద్, డిఎస్ఓ రాజేశ్వర్, సివిల్ సప్లై టాస్క్ ఫోర్స్ సభ్యులు, ఇంచార్జ్ హెడ్మాస్టర్ సునీత, అధికారులు పాల్గొన్నారు.



## యువత మేలుకో మత్తును మానుకో

- గుడుంబా నాటు సారా అమ్మిన వారిపై చట్టపరమైన చర్యలు
- ఎస్ ఐ గుర్రం కృష్ణ ప్రసాద్

**వాజేడు, విశాలభారతి:** మండల కేంద్ర పేరూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని యువతీ యువకులు మత్తుకు బానిసై ఆనందంగా గడప వలసిన జీవితాన్ని , బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని యువకులకు అవగాహన కల్పించారు. పేరూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఎటువంటి వ్యక్తులైన తెలంగాణ ప్రభుత్వం నిషేధించిన గుడుంబా నాటు సారా మరియు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు విక్రయించినట్లయితే ఆ వ్యక్తుల పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి డ్రగ్స్, గుడుంబా వంటి మత్తు పదార్థాలు విక్రయించే వారి సమాచారం ఇచ్చిన వ్యక్తులకు నగదు బహుమతి ఇవ్వటంతో పాటు వారి యొక్క సమాచారం గోప్యంగా ఉంటుంది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పేరూరు పోలీస్ స్టేషన్ ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ స్టేషన్ సిబ్బంది మరియు ప్రజలు పాల్గొన్నారు.



## గ్రామాలలో కాంగ్రెస్ నూతన అధ్యక్షులు

**నర్సింహులపేట, విశాలభారతి:** అజ్మీర తండా గ్రామపంచాయతీ లోని మండల ప్రధాన కార్యదర్శి శేరి రామకృష్ణ సమీక్షంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ నూతన అధ్యక్షులు ఎన్నుకొన్నారు. నూతన గ్రామ పార్టీ అధ్యక్షులుగా బి మెగ్య ఉపాధ్యక్షులుగా వి శ్రీను ప్రధాన కార్యదర్శిగా సేవ్య ఎస్టీ సెల్ అధ్యక్షులుగా బి రమేష్ ను నూతన అధ్యక్షులను ఎన్నుకోవడం జరిగింది. గ్రామ సీనియర్ నాయకులు బానోతు లక్ష్మణ్, బుక్య శక్రు, లచ్చు, నాగు ఇతర గ్రామ నాయకులు పాల్గొన్నారు. గ్రామ సీనియర్ నాయకులు లక్ష్మణ్ మాట్లాడుతూ రైతు రుణమాఫీ పై ప్రతిపక్ష పార్టీలు దుష్ప్రచారాన్ని ఖండిస్తూ అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ వస్తుందని భరోసానిస్తూ పార్టీ నాయకులను సూచించారు.



## ఎల్లంపేట సెక్టర్ సూపర్వైజర్ గా ఉషారాణి

**మరిపెడ, విశాలభారతి:** జిల్లా డోర్నకల్ నియోజకవర్గం మరిపెడ మండల ఐసిడిఎస్ ఎల్లంపేట సెక్టర్ సూపర్వైజర్ గా ఉషారాణి చార్జి తీసుకున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన సూపర్వైజర్ శ్రీలత చిన్న గూడూర్ మండలనికి బదిలీ కావడంతో ఆ స్థానంలో ఉషారాణి బాధ్యతలు తీసుకున్నారు. సూపర్వైజర్ కు ఎల్లంపేట సెక్టార్ మరిపెడ మండల సిఐడటియూ ఉపాధ్యక్షురాలు కుమ్మరి కుంట్ల జ్యోతి ఆధ్వర్యంలో ఎల్లంపేట సెక్టార్ అంగన్వాడీ టీచర్లందరూ శాలువాతో సత్కరించారు.



## గ్రామాలలో కాంగ్రెస్ నూతన అధ్యక్షులు

**విశాల భారతి, నర్సింహులపేట :** నర్సంపేట మండలం అజ్మీర తండా గ్రామపంచాయతీ లోని మండల ప్రధాన కార్యదర్శి సమీక్షంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ నూతన అధ్యక్షులు ఎన్నుకోవడం జరిగింది. నూతన గ్రామ పార్టీ అధ్యక్షులుగా బి. మెగ్య. ఉపాధ్యక్షులుగా వి శ్రీను. ప్రధాన కార్యదర్శిగా సేవ్య ఎస్టీ సెల్ అధ్యక్షులుగా బి రమేష్ మరియు కొన్ని నూతన అధ్యక్షులను ఎన్నుకోవడం జరిగింది. గ్రామ సీనియర్ నాయకులు బానోతు లక్ష్మణ్. బుక్య శక్రు. లచ్చు. నాగు.మరియు ఇతర గ్రామ నాయకులు పాల్గొన్నారు. గ్రామ సీనియర్ నాయకులు లక్ష్మణ్ మాట్లాడుతూ రైతు రుణమాఫీ పై ప్రతిపక్ష పార్టీలు దుష్ప్రచారాన్ని ఖండిస్తూ. అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ వస్తుందని భరోసానిస్తూ పార్టీ నాయకులను సూచించడం జరిగింది..



## పిడిఎస్యు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

- నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి
- పిడిఎస్యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్

**మహబూబాబాద్, విశాలభారతి:** జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య కళాశాలలో పిడిఎస్యు ఆధ్వర్యంలో విద్యార్థులకు శాస్త్రీయ విద్యావిధానం గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్య కాషాయికరణ చేస్తూ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందన్నారు. అంతే కాదు శాస్త్రీయ విద్యావిధానాన్ని అమలు చేసి అన్ని వర్గాల ప్రజలకు సమాన విద్య అందించాలని డిమాండ్ చేశారు. సాధారణ ప్రజానీకం నుండి ప్రధాన మంత్రి వరకు ఒకే రకమైన విద్యను అందించినప్పుడే శాస్త్రీయ విద్యావిధానం పూర్తిస్థాయిలో అమలైనట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 31లోగా అంబేద్కర్ ఓపెన్ డిగ్రీకి దరఖాస్తు చేసుకోండి



**బెల్లంపల్లి, విశాల భారతి** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఇంటర్మీడియట్ లేదా తత్సమాన అర్హతలు కలిగిన విద్యార్థినీ విద్యార్థులు ఈ నెల 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్, కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.ఏకాంబరం కోరారు. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన విద్యార్థులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని పేర్కొన్నారు. బిఏ, బీకాం, బీఎస్సీ కోర్సులలో అడ్మిషన్లు ఉన్నాయని తెలిపారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఆన్లైన్లో అప్లై చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఈ క్రింది నెంబర్లను 9640279766, 9346791768, 9502262490 సంప్రదించాలని కోరారు.



## రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ

- జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి

**ధర్పల్లి విశాల భారతి:** తెలంగాణ రాష్ట్రంలో అర్హత కలిగిన రైతులందరికీ రెండు లక్షల లోపు కచ్చితంగా రుణమాఫీ కల్పిస్తామని నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి అన్నారు. ధర్పల్లి మండల ప్రాథమిక సహకార సంఘంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట తెలంగాణా రైతు రుణమాఫీ కోసం రూ.31000 వేల కోట్లు కేటాయించడం జరిగిందని,ఇప్పటి వరకు 18000 వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని అన్నారు. మిగతా రూ.13000 కోట్లు తొందరలోనే విడుదల చేసి రైతులందరికి కచ్చితంగా రుణమాఫీ కల్పిస్తామని, ఇప్పటి వరకు రుణమాఫీ కానీ వారికి మరికొన్ని రోజుల్లో రుణ మాఫీ అవుతుందని బీఆర్ఎస్, భాజపా ల తప్పుడు ప్రచారాలు రైతులు నమ్మవద్దని, రైతులను మోసం చేసిన పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని అన్నారు. రైతులందరికీ రుణ మాఫీ జరిగితే హరీష్ రావు రాజీనామా చేసి రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న మాట నిజం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ముప్ప గంగారెడ్డి,మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాల్ రాజ్, సొసైటీ చైర్మన్ చెలిమెల మల్లికార్జున్,చెలిమెల శ్రీనివాస్,మిట్టపల్లి గంగారెడ్డి,సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సిపిఎస్ విధానం రద్దు చేయాలి

- తాహసీల్దార్ కు వినతి పత్రం

**ధర్పల్లి విశాల భారతి** దర్పల్లి మండలంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని ధర్పల్లి తాహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాహసీల్దార్ ప్రవీణ్ కు భోజన విరామ సమయంలో పిఆర్టియు ఆధ్వర్యంలో ఇంచార్జ్ తాహసీల్దార్ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రథమ జాతీయ అంతరిక్ష దినోత్సవం

**ధర్పల్లి విశాల భారతి:** ధర్పల్లి మండల కేంద్రంలో గల ఆదర్శ పాఠశాలలో ప్రథమ జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించామని కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర సాహెబ్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రథమ జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదర్శ పాఠశాల విధ్యార్థులు అనేక రకాల పెయింటింగ్స్, వివిధ రకాల అంతరిక్ష రాకెట్ ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించారు. విద్యార్థులలో శాస్త్రీయ, అంతరిక్ష ఆసక్తి పెంచుటకు రకరకాల గోడపత్రికలు తయారు చేయించి, క్విజ్ పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు సిబ్బంది, విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.



## మహారాజ్‌పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలి

**బెల్లంపల్లి, విశాల భారతి** ముస్లింల మనోభావాలు దెబ్బతీసే విధంగా మహారాష్ట్రకు చెందిన మహంతి రామగిరి మహారాజ్ అనే వ్యక్తి ఇస్లాం ప్రవక్త మహమ్మద్ పై చేసిన అవమానకరమైన వాఖ్యలను ఖండిస్తున్నామని జామా మసీద్ కమిటీ సభ్యులు తెలిపారు. బెల్లంపల్లిలో వారు మాట్లాడుతూ.. మహారాజ్ చేసిన వ్యాఖ్యలు ముస్లింల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉన్నాయని, దేశ ఐక్యతకు భంగం కలిగించే విధంగా ఉన్నాయన్నారు. వెంటనే అతనిపై కేసు నమోదు చేసి శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో 12 మసీదుల సదర్ ఖలీల్, జామ మస్జిద్ ఇమామ్ సాదికుల్ ఇస్లాం మత పెద్దలు స్థానిక ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.





## అడ్వాన్స్ ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణతో ఆర్థిక అభివృద్ధి సాధించాలి

- శిక్షణ సర్టిఫికెట్లను అందజేసిన నాబార్డ్ డిడిఎం దిలీప్ చంద్ర

**వేములవాడ, విశాల భారతి:** అడ్వాన్స్డ్ ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ నేర్చుకున్న మహిళలు ఈ శిక్షణతో మరింత ఆర్థిక అభివృద్ధి సాధించాలని నాబార్డ్ డీడీఎం దిలీప్ చంద్ర పిలుపునిచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ మండలంలోని చింతల్ తాన, అనుపురం గ్రామాలలో అడ్వాన్స్డ్ ఫ్యాషన్ డిజైనింగ్ ఇన్ డిఫరెంట్ మోడల్స్ శిక్షణ పొందిన మహిళలకు నాబార్డ్ డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ మేనేజర్ దిలీప్ చంద్ర సర్టిఫికెట్స్ ను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నాబార్డ్ డీడీఎం మాట్లాడుతూ 20రోజులపాటు నాబార్డ్, జనవికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణను పూర్తి చేసుకున్న స్వశక్తి మహిళలకు స్కూల్ యూనిఫార్మ్స్ స్టిచ్చింగ్, అధునాతన మోడల్ క్రాస్ నెక్ బోట్ నెక్ కఫ్ అండ్ కాలర్ నెక్ కోల్డ్ షోల్డర్ క్లోవ్ స్లీవ్ బ్లౌజెస్ రుపెల్ వీటికి ప్రస్తుతం మార్కెట్లో బాగా డిమాండ్ ఉందన్నారు. ఒక్క బ్లౌజ్ కు 3వేల నుండి 10వేల రూపాయల వరకు చార్జ్ చేయడం జరుగుతుందన్నారు. శిక్షణ తరువాత ప్రతి ఒక్కరూ కూడా బ్యాంకు ద్వారా క్రెడిట్ లింక్ కేజీ పొందాలని,తద్వారా ప్రతి ఒక్కరూ యూనిస్థాపన నెలకొల్పాలి అని తెలిపారు. ఈ కార్యక్రమం మహిళలకు ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం ఆకుల లింగం గౌడ్,జన వికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యదర్శి పెండ్లి సంపత్ కుమార్, జనవికాస ట్రైనర్ గందే మనిష,జన వికాస కోఆర్డినేటర్ రాజు పెసర,వివోఏలు స్వప్న,అధ్యక్షురాలు సుమలత 120 మంది స్వశక్తి మహిళలు పాల్గొన్నారు

## పేగు బంధమే.. కసాయిగా మారే



**వనపర్తి, విశాల భారతి::** సమాజంలో రోజురోజు మానవతా విలువలు మంట కలిసి పోతున్నాయి. కన్న కొడుకులే కసాయి తనంతో ప్రవర్తిస్తుంటే కన్న తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో ఉండే పరిస్థితి ఏర్పడింది. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం కేంద్రంలో కొత్త కాపు రాంరెడ్డి, కొత్త కాపు అనసూయమ్మ దంపతులకు ముగ్గురు కొడుకులు ఒక కూతురు ఉన్నారు. కాలక్రమేనా మారుతూ మానవత విలువలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్న కొడుకుల తీరు పట్ల ఆ తల్లి దండ్రులు శుక్రవారం ఆర్డిఓ కార్యాలయంలో వారి గోడు వెళ్లబోసుకున్నారు. అనంతరం ఆర్డిఓ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వృద్ధాప్యంలో ఉన్న ఆ తల్లిదండ్రుల ఆవేదన వ్యక్తం చేస్తూ మాట్లాడారు. స్వయంకృషితో 17 ఎకరాల 17 గుంటల భూమిని తన కష్టార్జితంతో కొనుగోలు చేసి ముగ్గురు కుమారులకు ఒక్కొక్కరికి 3.18 చొప్పున బాగా పరిష్కారాలు చేసి పట్టాలు చేశారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను కనీసం పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. గత ఆరేళ్లపాటు నుంచి పెన్షన్స్ తో కాలం వెలదీస్తున్నారు. ఇటీవల కాలంలో రామ్ రెడ్డికి పక్షవాతం వచ్చి మంచాన పడ్డారు. వృద్ధాప్యంలో ఆ తల్లిదండ్రులు రామ్ రెడ్డి, అనసూయమ్మ తండ్రి పరిస్థితి బాగాలేదని కొడుకులకు ఆవేదనతో వెళ్లిబుచ్చిన ఆ కసాయి కొడుకులు హక్కున చేర్చుకునే పరిస్థితి లేకపోలేదు. వారి పోషణకు ఇబ్బందులు తలెత్తడంతో వారు నివసిస్తున్న ఇంటిని అమ్మడానికి సిద్ధమయ్యారు. ఇబ్బందుల్లో ఉన్నప్పుడు రాని కొడుకు , కోడండ్లు ఇల్లు అమ్మేందుకు వెళ్తున్న ఇప్పుడు అడ్డుపడడం వారి మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం అని చెప్పాలి. వారి బాగోగులను వారి సమస్యలను ఆర్డీవోకు వినతిపత్ర రూపంలో సమర్పించారు. ఆర్డీవో స్పందిస్తూ సమస్యలతో ఇచ్చిన వినతులను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తుందని చెప్పారని రామ్ రెడ్డి అనసూయమ్మ తెలిపారు.



## వైద్య ఖర్చులను కోసం రూ.2లక్షల ఎల్ఓసి అందజేత

**బాల్కొండ, విశాల భారతి:** బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండలం పాలెం గ్రామానికి చెందిన రాజన్న తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం కోసం హైదరాబాదులోని నిమ్స్ హాస్పిటల్లో చేరారు. వైద్యానికి పెద్ద మొత్తంలో ఖర్చు అవుతుందని తెలియడంతో బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ ని సంప్రదించారు. వేంటనే సంపాదించిన ముత్యాల సునీల్ కుమార్ ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ.2లక్షల ఎల్ఓసిని మంజూరు చేయించి బాధిత కుంటుంబానికి అందజేశారు. ఆపద సమయంలో ఆదుకున్న ముత్యాల సునీల్ కుమార్ కి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



## మహిళలు ఆర్థికంగా బలోపేతం అవ్వాలి

**వనపర్తి, విశాల భారతి:** మహిళలు ఆర్థిక సాధికారత సాధించేందుకు కొంగొత్త ఉపాధి అవకాశాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మహిళా శక్తి పై గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వనపర్తి జిల్లాలోని స్వయం సహాయ మహిళా సంఘాల సభ్యులకు స్వయం ఉపాధి కల్పించడంతో పాటు సేవా రంగంలో పనిచేసే విధంగా కొత్త కొత్త వ్యాపారాల అవకాశాలు కల్పించాలని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిని ఆదేశించారు. పట్టణంలో క్యాంటీన్ ఏర్పాటు, పిజా హట్, మహిళలకు మోడ్రన్ జిమ్, స్పోర్ట్స్ షాప్, బ్యూటీ పార్లర్ హబ్ వంటివి నెలకొల్పేవిధంగా ఆసక్తిని కలిగించి అందుకు అవసరమైన అవసరమైన నైపుణ్య శిక్షణ ఇప్పించాలని సూచించారు. వనపర్తి పట్టణంలో మహిళా సాధికారతకు చాల అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ఉమాదేవి, డి.పి.యం అరుణ, అడిషనల్ డి.ఆర్.డి. ఓ భీమయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఆత్మీయ వీడ్కోలు సమావేశం

**చింతపల్లి విశాల భారతి** మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కురుమేడు గేటు నందు విధులు నిర్వహించి ఇటీవల జరిగిన బదిలీల్లో ఇతర పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులకు ఘనమైన సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చందన అధ్యక్షతన నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమంలో మండల విద్యాధికారి గురువా రావు మాట్లాడుతూ కుర్మేడు గేటు పాఠశాలను వారి పనితీరుతో అభివృద్ధిలోకి తీసుకువచ్చారని, విద్యార్థుల సంఖ్య పెరుగుదలకు చాలా కృషి చేశారని ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. వీడ్కోలు గ్రహీతలు జ్యోతి లక్ష్మి, చంద్ర కుమారి దీప, నరసింహలకు వీడుకోలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చందన, జెర్సీ రాణి, హరిత, అలివేలు, కుర్మేడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనంత రెడ్డి, స్కూల్ అసిస్టెంట్ సలీం, నారాయణ రెడ్డి, వెంకటయ్య, సమీప పాఠశాలల ఉపాధ్యాయులు చిన్న వెంకటేశ్వర్లు, పిల్లుట్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు



## ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- సీఐ నాగార్జున

**కల్వకుర్తి, విశాల భారతి** ప్రమాదాల నివారణకై ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సిఐ నాగార్జున వాహనదారులకు సూచించారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడమేనని అన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ వాహనానికి సంబంధించిన అన్ని రకాల పత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ ను కచ్చితంగా కలిగి ఉండాలని సూచించారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తే అట్టి వాహన యజమానికి భారీ జరిమానాలతో పాటు వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకుండా నిబంధనలకు లోబడి వాహనాలు నడపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మాధవరెడ్డి, ట్రాఫిక్ కానిస్టేబుల్ బాలునాయక్ ఉన్నారు.



## నెత్తిన బోనం.. పోచమ్మ ధ్యానం

- భక్తిశ్రద్ధలతో ఘనంగా పోచమ్మ బోనాలు

**వనపర్తి, విశాల భారతి::** బోనాల పండుగ తెలంగాణ సాంప్రదాయాలకు ప్రతీక. దశాబ్దల కాలంగా కొనసాగుతున్న బోనాల పండుగ సంబరాలు మహిళలు బోనమెత్తి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. శుక్రవారం దళితవాడలో వెలసిన పోచమ్మ , కర్రెమ్మ బోనాలను సాంప్రదాయ బద్ధంగా భక్తిశ్రద్ధలతో డప్పు సప్పులతో, శివసత్తుల నృత్యం ఘనంగా జరిగింది. ఈ బోనాల పండుగ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి పాల్గొని దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోచమ్మ, కర్రెమ్మ ఆలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో మొక్కు తీర్చుకున్నారు. అనంతరం తెలంగాణ సాంప్రదాయానికి ప్రత్యేకగా నిలుస్తున్న బోనాల పండుగను నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, దళిత మత పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

సినిమా
www.vishalabharati.com
epaper:vishalabharati.com

vishalabharathi Telugu Daily
శనివారం,
24.08.2024
హైదరాబాద్





## తేజ సజ్జా పాన్ ఇండియా ఫిల్మ్ 'మిరాయ్' బర్త్ డే పోస్టర్ రిలీజ్

పాన్ ఇండియా సక్సెస్ 'హను-మాన్'తో దూసుకుపోతున్న సూపర్ హీరో తేజ సజ్జా నెక్స్ట్ పాన్ ఇండియా మూవీ 'మిరాయ్'లో అలరించనున్నారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న ఈ యాక్షన్-అడ్వెంచర్‌లో తేజ సజ్జా సూపర్ యోధ పాత్రలో కనిపిస్తారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్ భారీ స్థాయిలో నిర్మిస్తునారు. తేజ సజ్జ పుట్టినరోజు సందర్భంగా బ్రాండ్ న్యూ పోస్టర్ ని పోస్టర్‌ను రిలీజ్ చేశారు. సినిమాలో తేజ సజ్జా పాత్రలోని కరేజియస్ స్పిరిట్ ని హైలైట్ చేస్తూ పోస్టర్ అద్భుతంగా ప్రజెంట్ చేశారు. పోస్టర్‌లో తేజ సజ్జ మండుతున్న ఐరెన్ రాడ్‌ను పట్టుకుని పైకి చూస్తున్నట్లు టెర్రిఫిక్ గా కనిపించారు. ప్రమాదకర పరిస్థితిలో చిక్కుకుపోయినప్పటికీ ఇంటెన్స్ గా వున్నారు. బ్యాక్ డ్రాప్ లో వెనుక ఒక పురాతన దేవాలయం ఉంది. ఈ పోస్టర్ ప్రేక్షకులని కట్టిపడేసింది. తేజ సజ్జా చాలా హార్డ్ వర్క్ చేసి సినిమా కోసం బెస్ట్ ఎఫర్ట్స్ పెడుతున్నారని బర్త్‌డే స్పెషల్ పోస్టర్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. న్యూ వరల్డ్ ని క్రియేట్ చేయడంలో డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనేని నైపుణ్యం కనిపిస్తుంది. అత్యున్నత స్థాయి ప్రొడక్షన్ వాల్యూస్ తో ఈ సినిమా టెక్నికల్ గా టాప్ క్లాస్ లో వుండబోతోంది. తేజ సజ్జ, మంచు మనోజ్ పాత్రలను పరిచయం చేసిన ఫస్ట్-లుక్ పోస్టర్లు, గ్లింప్స్ లకు ట్రెమండస్ రెస్పాన్స్ తో భారీ అంచనాలను నెలకొల్పాయి. ఈ కొత్త పోస్టర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది.

## విజయవంతంగా ప్రదర్శితమవుతున్న చియాన్ విక్రమ్ "తంగలాన్"



ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చిన "తంగలాన్" సినిమా భారీ నిర్మాణ విలువలు, చియాన్ విక్రమ్ అద్భుత నటనతో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని కలిగించింది. దర్శకుడు పా రంజిత్ మరోసారి తన వెండితెర మాయాజాలం చేశాడు. ఈ పీరియాడిక్ యాక్షన్ మూవీ ఈ నెల 15న థియేటర్స్ లోకి వచ్చి బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకుంది. అన్ని సెంటర్స్ నుంచి సక్సెస్ ఫుల్ టాక్ తో పాటు మంచి కలెక్షన్స్ రాబడుతోంది. మొదటి వారంతో చూస్తే రెండో వారంలో "తంగలాన్" సినిమాకు తెలంగాణ, ఏపీలో అదనంగా 141 థియేటర్స్ పెరిగాయి. నైజాం ఏరియాలోనే 90 థియేటర్స్ జోడించారు. తెలుగు స్ట్రైట్ సినిమాలతో పాటు విడుదలైన "తంగలాన్" గట్టి పోటీని తట్టుకుని బాక్సాఫీస్ వద్ద బలంగా నిలబడింది. ఈ సినిమా దిగ్విజయానికి రెండో వారంలోనూ భారీగా పెరిగిన ఈ థియేటర్స్ నిదర్శనంగా నిలుస్తున్నాయి. "తంగలాన్" చిత్రాన్ని దర్శకుడు పా రంజిత్ రూపొందించగా..నీలమ్ ప్రొడక్షన్స్ తో కలిసి స్టూడియో గ్రీన్ ఫిలింస్ బ్యానర్ పై ప్రముఖ నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. పార్వతీ తిరువోతు, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటించారు. పీరియాడిక్ యాక్షన్ డ్రామా కథతో మ్యాజికల్ రియలిజం స్క్రీన్ ప్లేతో తెరకెక్కిన "తంగలాన్" అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరిస్తోంది.



## కాకినాడలో 'మట్కా' ఇంపార్టెంట్ షెడ్యూల్ షూటింగ్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ తన మోస్ట్ ఎక్స్ పెన్సివ్ మూవీ 'మట్కా'తో పాన్ ఇండియాలో అడుగుపెడుతున్నారు. కరుణ కుమార్ దర్శకత్వంలో వైర ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి మూవీని మ్యాసీవ్ స్కేల్ లో నిర్మిస్తున్నారు. వరుణ్ తేజ్ ని డిఫరెంట్ లుక్స్ లో ప్రజెంట్ చేసిన ఫస్ట్‌లుక్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ప్రస్తుతం ఈ సినిమా కాకినాడలో షూటింగ్ జరుపుకుంటుంది. ఈ ముఖ్యమైన షెడ్యూల్‌లో, టీమ్ టాకీ పార్ట్, ప్రముఖ తారాగణంతో కూడిన యాక్షన్ పార్ట్‌ను చిత్రీకరిస్తోంది. మేకర్స్ విడుదల చేసిన పోస్టర్‌లో వరుణ్ తేజ్ చేతిలో తుపాకీతో కాకినాడ ఓడరేవులో క్రూయిజ్ షిప్ ముందు నిలబడి కనిపించారు.

## లగ్జరీ కార్లతో అక్కా చెల్లెళ్లు ధమాకా ఫెస్టివల్

అతిలోక సుందరి శ్రీదేవి నటవారసురాళ్లు జాన్వీ కపూర్- ఖుషి కపూర్ గురించి పరిచయం అవసరం లేదు. తొలుత జాన్వీ కపూర్ కథానాయికగా పరిచయమైంది. ఇప్పటికే స్టార్ గా నిరూపించుకుని కెరీర్ లో జోష్ చూపిస్తోంది. మరోవైపు ఖుషి కపూర్ ఓటీటీ సిరీస్ ది ఆర్చీస్ తో నటిగా పరిచయమైంది. ఇప్పుడు బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉంది. అక్కా చెల్లెళ్ల గ్రాఫ్ పెరిగే క్రమంలో వరుసగా లగ్జరీ కార్లు కొనుగోలు చేస్తూ ఆశ్చర్యపరుస్తున్నారు. ఆ ఇద్దరూ ఇటీవల ఒక్కొక్కటి రూ.2.5 లక్షల ఖరీదైన లగ్జరీ బ్రాండ్ కార్లను కొనుగోలు చేసారు. ముందుగా ఖుషి కపూర్ మెర్సిడెస్ బెంజ్- జి క్లాస్ వాగన్ కార్ ని కొనుగోలు చేసింది. దీని ఖరీదు సుమారు 2.5 కోట్ల నుంచి 4 కోట్ల మధ్య ఉంది. అయితే ఖుషి కపూర్ సంపాదించిన దాంతోనే ఈ లగ్జరీ కార్ ని కొనుగోలు చేసిందా లేక పాపా బోనీ కపూర్ పేమెంట్ చేసారా? అన్నది తెలియాల్సి ఉంది. ఇదిలా ఉండగానే జాన్వీ కపూర్ కూడా తన సోదరితో పోటీపడుతూ 2.5 కోట్ల ఖరీదు చేసే కొత్త టొయోటా లెక్సస్ ఎమ్‌పివిని కొనుగోలు చేసింది. తన కొత్త SUVలో హీరో వరుణ్ ధావన్ తో కలిసి రైడ్ కి వెళ్లింది. టయోటా లెక్సస్ ఎమ్‌పివి విషయానికి వస్తే, తెలుగు చిత్ర పరిశ్రమలో ఈ లగ్జరీ కారును కొనుగోలు చేసిన మొదటి తెలుగు స్టార్ అక్కినేని నాగార్జున. ఎన్టీఆర్ కూడా కొనుగోలు చేసారు. ఇప్పుడు యువకథానాయికలు కూడా ఈ జాబితాలో చేరుతుండడం ఆశ్చర్యపరుస్తోంది. జాన్వీ కపూర్ ప్రస్తుతం ఎన్టీఆర్ సరసన దేవరలో నటిస్తోంది. మరోవైపు ఇప్పటికే సెట్స్‌పైకి వెళ్లిన రామ్ చరణ్ కొత్త సినిమాలో కూడా జాన్వీ కనిపించనుంది. ఉప్పెన ఫేం బుచ్చిబాబు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. మరోవైపు ఖుషి కపూర్ సైఫ్ అలీఖాన్ కుమారుడి డెబ్యూ సినిమాలో నటిస్తోంది. ఇది తనకు పెద్ద తెర ఆరంగేట్ర చిత్రం. మరోవైపు ఖుషి తెలుగులో నందమూరి బాలకృష్ణ కుమారుడు మోక్షజ్ఞ సరసన నాయికగా పరిచయం కానుందని కథనాలొస్తున్నాయి. అయితే అధికారికంగా వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.





యంగ్ హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ రహస్య గోరక్ వివాహం గురువారం రాత్రి కర్ణాటకలోని కూర్గ్ లో ఘనంగా జరిగింది. కూర్గ్ లోని ఓ రిసార్ట్ లో కుటుంబ సభ్యులు, సన్నిహితులైన మిత్రుల సమక్షంలో వీరి వివాహ వేడుకలు జరిగాయి. కిరణ్ అబ్బవరం, రహస్య గోరక్ వివాహ వేడుకల ఫొటోస్, వీడియోస్ సోషల్ మీడియాలో సందడి చేస్తున్నాయి. సినీ ప్రియులు, చిత్ర పరిశ్రమకు చెందిన మిత్రులు ఈ కొత్త జంటకు శుభాకాంక్షలు చెబుతూ పోస్ట్ లు చేస్తున్నారు. రాజావారు రాణిగారు సినిమాలో కలిసి నటించిన కిరణ్ అబ్బవరం, రహస్య గోరక్... ఆ సినిమా చిత్రీకరణ సమయంలోనే పరస్పరం ఇష్టపడ్డారు. ఇప్పుడు పెద్దల అంగీకారంతో వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు. కిరణ్ అబ్బవరం ప్రస్తుతం భారీ పీరియాడిక్ థ్రిల్లర్ మూవీ "క" లో నటిస్తున్నారు. ఈ త్వరలోనే ఈ సినిమా పాన్ ఇండియా రిలీజ్ కు రెడీ అవుతోంది.

## రూ. 15.6 కోట్ల వసూళ్లతో దూసుకెళ్తోన్న 'కమిటీ కుర్రోళ్ళు'



డిఫరెంట్ కంటెంట్ చిత్రాలకు ప్రేక్షకాదరణ ఎప్పుడూ ఉంటుందని తెలుగు ప్రేక్షకులు మరోసారి 'కమిటీ కుర్రోళ్ళు' చిత్రంతో నిరూపించారు. సీనియర్ నటీనటులతో పాటు 11 మంది హీరోలు, నలుగురు హీరోయిన్స్‌ను తెలుగు సినిమాకు పరిచయం చేస్తూ మేకర్స్ చేసిన ఈ ప్రయత్నానికి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. ఆడియెన్స్, విమర్శకుల తో పాటు సినీ సెలబ్రిటీ నుంచి అభినందనలు అందుకుంటూ సినిమా బాక్సాఫీస్ దగ్గర జోరు చూపిస్తోంది. ఇప్పటికే సినిమా అన్నీ ఏరియాస్‌లో బ్రేక్ ఈవెన్ సాధించిన ఈ చిత్రం రూ.15.6 కోట్ల కలెక్షన్స్‌ను సాధించటం విశేషం. కంటెంట్ ఉన్నోడికి కటౌట్ చాలనే డైలాగ్ తరహాలో మంచి కథతో చేసిన సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకంతో నిహారిక అండ్ టీమ్ కమిటీ కుర్రోళ్ళు సినిమాను ప్రమోట్ చేస్తూ వచ్చింది. రోజు రోజుకీ ఆదరణతో పాటు బాక్సాఫీస్ దగ్గర వసూళ్లను కూడా పెంచుకోవటంలో కమిటీ కుర్రోళ్ళు సక్సెస్ అయ్యారు. సినిమా విజయవంతంగా మూడో వారంలోకి అడుగు పెట్టేసింది. రెండో వారం కంటే మూడో వారంలో సినిమా ప్రేక్షకాదరణ పొందుతుండటం విశేషం. నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్.ఎల్.పి, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్స్‌పై రూపొందిన చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు'. ఈ సినిమాకు యదు వంశీ దర్శకుడు. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని ఆగస్ట్ 9న వంశీ నందిపాటి విడుదల చేశారు. డిఫరెంట్ కంటెంట్‌తో ఇటు ఫ్యామిలీ ఆడియెన్స్, అటు యూత్‌ను ఆకట్టుకుంటోంది చిత్రం.



## 'కన్నప్ప' నుంచి అవ్రామ్ మంచు ఫస్ట్ లుక్

విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా 'కన్నప్ప' చిత్రం రాబోతోన్న సంగతి తెలిసిందే. ప్రతీ సోమవారం కన్నప్ప నుంచి ఒక అప్డేట్ ఇస్తూ సినిమా మీద అంచనాలు పెంచేస్తూనే ఉన్నారు. సినిమాలోని కీలక పాత్రలకు సంబంధించిన పోస్టర్‌లను రిలీజ్ చేస్తూ బజ్ క్రియేట్ చేస్తున్నారు. కృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఈ సోమవారం నాడు స్పెషల్ కారెక్టర్‌కు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేస్తున్నారు. కృష్ణాష్టమి సందర్భంగా మంచు విష్ణు తనయుడు అవ్రామ్ మంచు ఫస్ట్ లుక్ విడుదల కానుంది. ముఖ్యమైన పాత్రలో నటిస్తున్న అవ్రామ్ ఈ సినిమాతో సినీ రంగ ప్రవేశం చేస్తున్నాడు. మంచు వారి మూడు తరాలు ఇందులో కనిపించబోతున్నాయి. మోహన్ బాబు, విష్ణు మంచు, అవ్రామ్ మంచు కలయికతో ఈ చిత్రం స్పెషల్ కానుంది. అవ్రామ్ పాత్ర, సినిమాలో లుక్ ఎలా ఉంటుందో తెలుసుకోవాలంటే మరో 3 రోజులు ఆగాలి. విష్ణు మంచు టైటిల్ రోల్‌లో కనిపించనున్న కన్నప్ప అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌గా రాబోతోంది. ఇటీవలె విడుదల చేసిన టీజర్‌కి అద్భుతమైన స్పందన రావడంతో అంచనాలు ఆకాశాన్నంటాయి. డిసెంబర్‌లో ఈ సినిమా పాన్ ఇండియా వైడ్‌గా విడుదల కానుంది.

## "35చిన్న కథ కాదు" నుంచి చిన్నా ఇది వింత లోకం సాంగ్ రిలీజ్



నివేత థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ లీడ్ రోల్స్ లో నటించిన న్యూ ఏజ్ క్లీన్ ఎంటర్‌టైనర్."35-చిన్న కథ కాదు. సురేష్ ప్రొడక్షన్స్, ఎస్ ఒరిజినల్స్, వాల్టెయిర్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రానికి నంద కిషోర్ ఈమాని రైటర్ డైరెక్టర్. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కు చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ చిన్నా ఇది వింత లోకం సాంగ్ రిలీజ్ చేశారు. చిల్డ్రన్స్, ఇన్నోసెంట్ హార్ట్స్ ని బ్యూటీఫుల్ గా ప్రజెంట్ చేసిన ఈ పాటని వివేక్ సాగర్ సూపర్బ్ గా కంపోజ్ చేశారు. భరద్వాజ్ గాలి రాసిన లిరిక్స్ అందరూ రిలేట్ చేసుకునేలా వున్నాయి. సింగర్ విజయ్ ప్రకాష్ లైవ్లీగా పాడిన ఈ పాట మళ్ళీ మళ్ళీ వినాలనిపించేలా వుంది. స్కూల్ ఎపిసోడ్స్ స్పెషల్ ఎట్రాక్షన్ గా క్లీన్ ఎంటర్ టైన్ మెంట్ తో అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేందుకు ఈ సినిమా రెడీ అవుతోంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.